VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శనివారం 04.07.2026

సంపుటి : 08 సంచిక : 25 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



## బీజేపీ రామ్‌జీ తో కేంద్రానికి పేరుస్తుందని కాంగ్రెస్ కు అక్కసు

2

# నేడే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

- 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా మిడ్జిల్‌లో కృతజ్ఞత సభ
- ఊరుకొండ ఆలయ దర్శనం.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ప్రజాప్రతినిధిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి 20 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, జడ్పీటీసీగా తనకు రాజకీయ జన్మనిచ్చిన మిడ్జిల్‌లో కృతజ్ఞత సభ నిర్వహించనున్నారు.మధ్యాహ్నం 12.30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండపేటకు చేరుకోనున్న సీఎం.. అక్కడి ఊరుకొండ ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకోనున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ ఆవరణలో ఆత్మీయులు, ఆనాటి పెద్దలతో ఏర్పాటు చేసిన లంచ్, మాటాముచ్చట కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ఊరుకొండపేట నుంచి రోడ్డు మార్గంలో మిడ్జిల్‌కు బయలుదేరనున్నారు.మధ్యాహ్నం 2.45 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి చేరుకోనున్న ముఖ్యమంత్రి.. వెల్జాల క్రాస్ రోడ్డు వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ద్యాప గోపాల్ రెడ్డి (గుడిగానిపల్లి గోపాల్ రెడ్డి) విగ్రహాలను ఆవిష్కరించనున్నారు.అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని మిడ్జిల్ మండలంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు.



## జూపల్లి సవాళ్లు మాటలకే పరిమితం..

- కాంగ్రెస్ ప్రభుత్వం డ్యామేజ్ కంట్రోల్‌లో ఉంది
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- జూపల్లి తీరు పూటకో సవాల్, రోజుకో అడ్రస్‌లా మారిందని విమర్శ



2

- తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి గన్‌పార్క్‌కు వెళ్లారని ఆరోపణ
- గన్‌పార్క్‌కు వెళ్లకుండా తమను పోలీసులు అడ్డుకున్నారని వ్యాఖ్య

## బీఆర్ఎస్ అప్పులపై భట్టి ఆగ్రహం

- మాజీ మంత్రి హరీశ్ పై డిప్యూటీ సీఎం ఆరోపణలు
- రూ.8.21 లక్షల కోట్ల లెక్కలు చెప్పాలని డిమాండ్
- సచివాలయం వేదికగా డిప్యూటీ సీఎం ప్రెస్ మీట్
- ప్రతిపక్షాల అసత్య ప్రచారాలపై నిప్పులు



2

## కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన మంత్రి సీతక్క



2

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 03:**

తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవిని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు.తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్), మిల్క్ అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి సీతక్క కేంద్ర మంత్రికి వివరించారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న టీపీసీసీ చీఫ్

**కొండగట్టు వెలుతురు జూలై 03:**



టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా తెలంగాణలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులు, యువత, మహిళలు సంతోషంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మెగా రివ్యూ
- 2027 డిసెంబర్ నాటికి కొత్త హైకోర్టు, ఉస్మానియా సిద్ధం
- సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖపై మంత్రి సమీక్ష
- పనుల పురోగతిపై అధికారులకు కీలక ఆదేశాలు
- రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి నిర్ణయం
- రెండేళ్లలో మారనున్న రోడ్ల ముఖచిత్రం
- రూ.13 వేల కోట్లతో మొదటి ఫేజ్ పనులు
- జూలైలో పట్టాలెక్కనున్న 10 ప్యాకేజీల ప్రాజెక్టులు



3

## మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పిసిసిఎఫ్ వినయ్ కుమార్

- అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేఖ
- అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనం పెంపుదల పై ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణను అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశం
- అటవీ సంపద సంరక్షణకు విశేష కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం వార్షిక అవార్డుల ఉత్తర్వులు జారీచేయడంలో చొరవ చూపినందుకుగాను మంత్రి సురేఖకు ధన్యవాదాలు తెలిపిన పిసిసిఎఫ్
- తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ శ్రీమతి సువర్ణను చీరతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపి, అటవీ శాఖకు సువర్ణ అందించిన విశిష్ట సేవలను కొనియాడిన మంత్రి సురేఖ





8

## బీఆర్ఎస్‌తో బహిరంగ చర్చకు సిద్ధం: మహేష్ కుమార్ గౌడ్

- అభివృద్ధి, సంక్షేమం, రాష్ట్ర అప్పులపై ఎప్పుడైనా చర్చిద్దాం
- వాస్తవాలు చెబితే రాద్ధాంతం చేయొద్దని వ్యాఖ్య

**కరీంనగర్ వెలుతురు జూలై 03:**

కరీంనగర్ పర్యటనకు వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.



8

## అయోధ్య విరాళాల కేసులో కీలక మలుపు..

- ఐదేళ్ల ఖాతాల రీఆడిట్‌కు సిట్ నిర్ణయం
- ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై సమగ్ర పరిశీలన
- ప్రధాన నిందితుడు అవినాష్ శుక్లా పోలీసుల అదుపులో
- చంపత్‌రాయ్, అనిల్ మిశ్రా రాజీనామాలపై జూలై 6న నిర్ణయం



8

## బంగాళాఖాతంలో అల్పపీడనం..

- మూడు రోజుల భారీ వర్షాలు
- తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక
- తెలంగాణ ఉత్తర జిల్లాల్లో భారీ వర్ష సూచన
- ఏపీలోనూ పలుచోట్ల వానలు
- 40–50 కి.మీ వేగంతో ఈదురు గాలులు



2

## రూ. 2 వేల కోట్ల స్కాం ఎలా జరుగుతుంది?: మంత్రి పొన్నం ప్రభాకర్

- గన్‌పార్క్ ఘటనపై హరీశ్‌రావుకు కౌంటర్
- టెండర్ల విలువ రూ.1,142 కోట్లు మాత్రమేనని స్పష్టీకరణ

**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**

మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతల విమర్శలకు సమాధానమిచ్చారు. గన్‌పార్క్ వద్ద జరిగిన ఘటనపై స్పందిస్తూ, గోషామహల్, మలక్‌పేట ప్రాంతాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఉందని ముందుగానే సమాచారం ఇచ్చి అక్కడికి వెళ్లామని తెలిపారు. ▶ మిగతా 8లో

## రాష్ట్రంలో అందుబాటులోకి రానున్న మరో ఆయిల్ పామ్ కర్మాగారం

- ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో గోద్రెజ్ కంపెనీ నిర్మిస్తున్న ఆయిల్ పామ్ కర్మాగారం పనులు తుదిదశలో
- త్వరలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం
- OER విషయంలో రైతులకు వ్యతిరేకంగా ప్రైవేట్ కంపెనీలు తీసుకునే చర్యలను ప్రభుత్వం ఏ మాత్రం ఉపేక్షించదు



- సచివాలయంలో గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, వెలుతురు జూలై 3:**

రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా మరో ఆధునిక ఆయిల్ పామ్ కర్మాగారాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ▶ మిగతా 7లో

# జూపల్లి సవాళ్లు మాటలకే పరిమితం..

- చర్చకు కేసీఆర్ రావాలని ఇప్పుడు కొత్త షరతులు పెడుతున్నారని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులపై జూపల్లి లేఖలోనే స్పష్టమైన వివరాలు న్నాయని వ్యాఖ్య
- రూ.1.77 లక్షల కోట్ల అప్పులు చేశామని జూపల్లే అంగీకరించారని హరీశ్‌రావు
- కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రూ.1.86 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపణ
- ఆర్‌బీఐ ఎఫ్ఆర్‌బీఎం రుణాల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని విమర్శ
- ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ
- ప్రభుత్వం ప్రస్తుతం డ్యామేజ్ కంట్రోల్‌లో భాగంగానే వివరణలు ఇస్తోందని వ్యాఖ్య

హైదరాబాద్ వెలుతురు జూలై 03:

మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు పూటకో సవాల్, రోజుకో అడ్రస్‌లా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత టీ హరీశ్ రావు విమర్శించారు. సంగారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై, మంత్రి జూపల్లి వ్యవహార శైలిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాళ్లను రాష్ట్ర ప్రజలు ఇప్పటికే చూశారని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌కు వస్తానని ముందుగా ప్రకటించిన మంత్రి, అనంతరం తన మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారని ఆరోపించారు. తాము గన్‌పార్క్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ చర్చకు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ రావాలని కొత్త షరతులు పెడుతున్నారని విమర్శించారు.జూపల్లి ఇటీవల వాట్సాప్‌లో విడుదల చేసిన లేఖలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పుల వివరాలను ప్రస్తావించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఆ లేఖలోనే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.77 లక్షల కోట్ల అప్పులు చేశామని మంత్రి స్వయంగా పేర్కొన్నారని అన్నారు.ఆర్‌బీఐ ద్వారా తీసుకున్న ఎఫ్ఆర్‌బీఎం రుణాల పూర్తి వివరాలను తాము వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రూ.1.86 లక్షల కోట్ల అప్పు చేసిందని పేర్కొంటూ, ఆర్‌బీఐ నుంచి తీసుకున్న రుణాల లెక్కల్లోనే తేడాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలను గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తోందని, ప్రస్తుతం డ్యామేజ్ కంట్రోల్‌లో భాగంగానే వివరణలు ఇస్తోందని విమర్శించారు.ప్రభుత్వం అప్పులపై పూర్తి శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్ అప్పులపై భట్టి ఆగ్రహం

- అబద్ధాల పునాదులపైనే పదేళ్ల బీఆర్ఎస్ పాలన
- కేటీఆర్, హరీశ్‌రావు ద్వయంపై ఘాటు విమర్శలు
- రాష్ట్రం నెత్తిన రూ.8.21 లక్షల కోట్ల గుదిబండ
- భారీ అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- రెండున్నరేళ్లలోనే రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీల చెల్లింపు
- అప్పుల రీస్ట్రక్చరింగ్‌తో భారీగా తగ్గిన వడ్డీల మోత

హైదరాబాద్ వెలుతురు జూలై 03:

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా మాజీ ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్ రావు సోషల్ మీడియా వేదికగా, బహిరంగ సభల్లో పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో భట్టి విక్రమార్క అత్యవసర మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత గులాబీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని, అడ్డగోలు అప్పుల తాలూకు నిజాలను శ్వేతపత్రం తరహాలో లెక్కలతో సహా బయటపెట్టి సంచలనం సృష్టించారు.మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..గతంలో తానే స్వయంగా రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించాననే కనీస జ్ఞానం కూడా లేకుండా హరీశ్ రావు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాటు కేవలం అబద్ధాల పునాదులపైనే నకిలీ పరిపాలన సాగించింది. తాము చేసిన అక్రమాలను, అడ్డగోలు అప్పులను కప్పిపుచ్చుకోవడానికే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ కలిసి ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు" అని దుయ్యబట్టారు. వారి ఉనికిని చాటుకోవడానికే ఇప్పుడు హడావిడి చేస్తున్నారని విమర్శించారు.గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏ స్థాయిలో అప్పుల ఊబిలోకి నెట్టిందో భట్టి విక్రమార్క వివరించారు. బీఆర్ఎస్ పాలన ముగిసే సమయానికి రాష్ట్రం చేసిన మొత్తం అప్పులు అక్షరాలా రూ.8.21 లక్షల కోట్లకు చేరిందని ఆయన అధికారిక గణాంకాలను వెల్లడించారు. ఈ భారీ మొత్తంలో గత ప్రభుత్వం వివిధ కాంట్రాక్టర్లకు, సంస్థలకు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన వేల కోట్ల రూపాయల బకాయిలు కూడా కలిసి ఉన్నాయని స్పష్టం చేశారు. ఇంతటి ఘోరమైన ఆర్థిక సంక్షోభానికి కారకుడైన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.గత పాలకులు చేసిన అనాలోచిత అప్పుల వల్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై పడుతున్న అదనపు భారాన్ని ఆర్థిక మంత్రి భట్టి వివరించారు. బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన అప్పులకు గానూ, గడిచిన రెండున్నరేళ్ల కాలంలోనే తమ ప్రభుత్వం అసలు మరియు వడ్డీల రూపంలో ఏకంగా రూ.2,08,061 కోట్లను బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇంతటి పెను భారాన్ని నెత్తిన మోస్తూ కూడా, ప్రజా ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా పేద ప్రజల సంక్షేమ పథకాలను, గ్యారంటీలను నిరంతరాయంగా విజయవంతంగా అమలు చేస్తోందని ఆయన గర్వంగా ప్రకటించారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం అత్యధిక వడ్డీ రేట్లకు విచ్చలవిడిగా అప్పులు తెచ్చిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ.. ఆ భారీ వడ్డీ అప్పులను బ్యాంకర్లతో మాట్లాడి 'రీస్ట్రక్చరింగ్' చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ చాకచక్యమైన ఆర్థిక నిర్వహణ కారణంగా గతంలో ఏటా కట్టాల్సిన రూ.34 వేల కోట్ల వడ్డీ భారాన్ని, ఇప్పుడు రూ.11 వేల కోట్లకు తగ్గించగలిగామని వివరించారు. కేసీఆర్, హరీశ్ రావులకు గతం లేదు, భవిష్యత్తూ లేదు కాబట్టే ఇలాంటి వాస్తవాలను జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు.ఆర్థికాంశాలతో పాటు తెలంగాణకు తలమానికమైన సింగరేణి కాలరీస్ సంస్థను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు సింగరేణి కార్మిక ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధపు హామీలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. "మీ పదేళ్ల సుదీర్ఘ కాలంలో సింగరేణి సంస్థ పరిధిలో కనీసం ఒక్క కొత్త కోల్ బ్లాక్‌నైనా అందుబాటులోకి తెచ్చారా? ఇన్నాళ్లూ కొత్త బొగ్గు గనులు రాకుండా అడ్డుపడి, సంస్థను నష్టాల్లోకి నెట్టిందే బీఆర్ఎస్ నాయకులు" అని నిలదీశారు.సింగరేణి సంస్థ పరిధిలో కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని, అక్కడ నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము చాలా సీరియస్‌గా ఉన్నామని మంత్రి భట్టి స్పష్టం చేశారు. గతంలో పెద్ద ఎత్తున బొగ్గు అక్రమ రవాణా జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే తాము సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌కు పూర్తిస్థాయి విచారణ జరపాలని కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ అక్రమాలకు కారణమైన ఎంతటి వారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.సింగరేణి సంస్థ భవిష్యత్తును కాపాడేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. నూతన కోల్ బ్లాక్‌లను సింగరేణికే దక్కించుకునేలా తాము నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. లాభాల బాటలో పయనించేలా సింగరేణిని పునర్నిర్మిస్తూనే.. రాత్రింబవళ్లు కష్టపడే కార్మికుల ప్రయోజనాలను, వారి హక్కులను ప్రజా ప్రభుత్వం అన్ని వేళలా కాపాడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

# కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ...

(మొదటి పేజీ తరువాయి)

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో ఈ పథకం కీలకంగా మారిందని పేర్కొంటూ, ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాల్లో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కేవలం 20 శాతం మాత్రమే భరిస్తోందని, పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర వాటాను గణనీయంగా పెంచాలని మంత్రి సీతక్క కోరారు.టీనేజ్ బాలికల్లో రక్తహీనత (అనీమియా) సమస్యను తగ్గించేందుకు ప్రత్యేక పోషకాహార కార్యక్రమాన్ని అమలు చేయాలని, ఇందుకు అవసరమైన ప్రత్యేక ఆహార పంపిణీ కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి మరో వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని మంత్రి సీతక్క ఈ సందర్భంగా కోరారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం..

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్ వెలుతురు జూలై 03:

ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపారు.ఇక ఆంధ్రప్రదేశ్‌లో వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ వ్యవస్థ రానున్న రెండు నుంచి మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని తెలిపారు.అల్పపీడనం ప్రభావంతో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, మత్స్యకారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# వీబీజీ రామ్ జీ తో కేంద్రానికి పేరుస్తుందని కాంగ్రెస్ కు అక్కసు

- రాష్ట్రానికి భారమనుకుంటే ప్రధానితో మాట్లాడి ఒప్పించండి
- పేదలకు మంచి జరుగుతుంటే కోర్టుకు వెళ్లడం దుర్మార్గం
- పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ సరే... 10 వేల స్కూళ్ల మూసివేత యోచన దుర్మార్గం
- బిగ్ బాస్ షో ను తలపిస్తోన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు
- సింగరేణి బొగ్గు మాయంపై విచారణ చేసే దమ్ము లేదా?
- చేతగాదని లేఖ రాస్తే విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధం
- పొన్నం వ్యాఖ్యలు ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం...
- కరీంనగర్ ను మరిన్ని నిధులు తెస్తా... అభివృద్ధి చేస్తా
- డంపింగ్ యార్డు వద్ద ఇకపై చెత్తను నిల్వ లేకుండా చేస్తాం
- బీజేపీ ఎదుగుతోందనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్
- బిగ్ బాస్ షో ను తలపిస్తోన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు...
- బీజేపీ బలపడుతుంటే ఓర్వలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ తో అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నాయి
- ఫోన్ ట్యాపింగ్ బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?
- బీజేపీ ఎదుగుతోందనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్
- కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్...
- కరీంనగర్ లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి

కరీంనగర్ వెలుతురు జూలై 03:

వీబీజీ రామ్ జీ పథకం ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరగడంతోపాటు గ్రామాల్లో ఆస్తుల సృష్టి జరగబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్రానికి మంచి పేరుస్తుందని అక్కసుతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఈ స్కీం అమలు రాష్ట్రానికి భారం అన్పిస్తే ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలే తప్ప కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులు, టీచర్లకు బ్రేక్ ఫాస్ట్, పాలు, లంచ్ సౌకర్యం కల్పించడాన్ని కేంద్ర మంత్రి స్వాగతించారు. ఒకవైపు బ్రేక్ ఫాస్ట్ సౌకర్యం కల్పిస్తూనే మరోవైపు రాష్ట్రంలో ఏకంగా 10 వేల స్కూళ్లను మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాఠశాలలను మూసివేయడం దుర్మార్గమన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో బాధ్యులపై ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ పిక్సింగ్ జరగడమే కారణమన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుతోందని, చాపకింద నీరుగా బలపడుతుండటంతో ఓర్వలేకి కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతలు కుమ్మక్కై బిగ్ బాస్ షోను తలపించేలా డ్రామాలాడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు అవినీతి పార్టీలేనని, అందుకే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆ రెండు పార్టీలను ఎలిమినేషన్ చేసి డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. శుక్రవారం రోజున కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ కేఏపీపీ చంద్ర(టింకు)తో కలిసి కరీంనగర్ లోని 37వ డివిజన్ లో రూ.77 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. షాషామహల్ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే.కరీంనగర్ లోనా 37వ డివిజన్ లో రూ.77 లక్షల మన్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. 7వ డివిజన్ లో బీజేపీ గెలవదని చాలా మంది చెప్పారు.. కానీ గెలిచి చూపించాం. చంద్రను ఆశీర్వించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం... సమస్యల్లేని డివిజన్ గా తీర్చిదిద్దుతా. మరో వారం రోజుల్లో రూ.50 కోట్ల యూడీఎఫ్ నిధులతో కరీంనగర్ లో రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించబోతున్నాం. అట్లాగే మరో 3 నెలల్లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) స్కీం కింద కేంద్రం ఇచ్చిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ ను సుందరంగా తీర్చిదిద్దే పనులను ప్రారంభించబోతున్నాం. మీకు తెలుసు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించిన 100 రోజుల్లోనే యూడీఎఫ్ నిధులను తీసుకొచ్చిన. గతంలో నిధుల్లేక ఇబ్బందులు పడేవాళ్లం.. కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా ఇవ్వలేని దుస్థితి. ఇయాళ గల్లా ఎగరేసుకుని అభివృద్ధి పనులు చేయించే సత్తా కార్పొరేటర్లకు వచ్చింది. కరీంనగర్ లో పార్కింగ్ సమస్య లేకుండా రూ.25 కోట్లతో శాశ్వత పరిష్కార పనులకు శ్రీకారం చుట్టినం. అట్లాగే అమ్రుత్ నిధులతో కరీంనగర్ లో మంచి నీటి సమస్య లేకుండా చేస్తాం. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో కరీంనగర్ ను అభివృద్ధి చేస్తున్నా. ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.22 వేల కోట్లు తీసుకొచ్చిన. రోడ్ల నిర్మాణం కోసమే రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నం. దసరా నాటికి కరీంనగర్ వరంగల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు



అందుబాటులోకి తీసుకొస్తాం. అతి త్వరలో కరీంనగర్ జగిత్యాల హైవే పనులను ప్రారంభిస్తాం. గన్నేరువరం ప్రజల చిరకాల వాంఛ అయిన గన్నేరువరం బ్రిడ్జి నిర్మాణ పనులకు సైతం అతి త్వరలో శ్రీకారం చుట్టబోతున్నాం. రాబోయే రోజుల్లో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా... అభివృద్ధి చేస్తా.

### పొన్నం వ్యాఖ్యలకు బండి కౌంటర్...

యూసీఎఫ్ నిధులపై మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం. దేశవ్యాప్తంగా 17 ప్రాజెక్టులకు మాత్రమే యూసీఎఫ్ ఫండ్ ఇస్తే... కరీంనగర్ ఉందనే విషయం మర్చిపోతే ఎలా?. యూసీఎఫ్ స్కీం కేంద్రానిదే కదా. పొన్నంకు చిత్తశుద్ధి ఉంటే... కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులెందుకు ఇవ్వడం లేదు. నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నా.

### డంపింగ్ యార్డు వద్ద ఇకపై చెత్తను నిల్వ లేకుండా చేస్తాం

కరీంనగర్ లో డంపింగ్ యార్డ్ ఇబ్బందులను తొలగించబోతున్నాం. డంపింగ్ యార్డ్ వద్ద చెత్త నిల్వ లేకుండా చేయబోతున్నాం. హుజూరాబాద్ లోనూ డంపింగ్ యార్డును బీజేపీ వ్యతిరేకిస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా దూరంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

### బిగ్ బాస్ షో ను తలపిస్తోన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు...

కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు బిగ్ బాస్ షోను తలపిస్తోంది. వాళ్ల నాటకాలను చూసి జనం నవ్వుకుంటున్నారు. మీడియా కవరేజీ కోసం రెండు పార్టీలు పడుతున్న తంటాలను చూసి జనం నవ్వుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే. ఆ రెండు పార్టీలను తెలంగాణ ప్రజలు ఎలిమినేషన్ చేయబోతున్నారు. తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని జనం కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని రేవంత్ రెడ్డి పదేపదే చెప్పారు.

### ఫోన్ ట్యాపింగ్ బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?

బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డారని కూడా సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. భార్యాభర్తల ఫోన్లను కూడా వింటూ నీచానికి పాల్పడుతున్నారని అంటున్నారు. అయినా బాధ్యులపై ఇంతవరకు చర్యలు ఎందుకు తీసుకోలేదు? గత ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ ప్రత్యర్థులను వేధించడానికి వాళ్ల ఫోన్ నెంబర్లను కూడా ట్యాపింగ్ చేయించారు. అయినా ఈ కేసు విచారణను ఎప్పుడు పూర్తి చేస్తారు? బాధ్యులను ఎప్పుడు అరెస్ట్ చేస్తారు?. ఫోన్ ట్యాపింగ్ కేసు జాప్యం వెనుక కారణాలేమిటి?

### బీజేపీ ఎదుగుతోందనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్

తెలంగాణలో బీజేపీ బలోపేతం అవుతుందని కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయి. బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని డ్రామాలాడుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కు ఏ ఉప ఎన్నికల్లోనూ, మున్సిపల్ ఎన్నికల్లోనూ డిపాజిట్లు రాలేదు. ప్రజల ఆశీర్వాదంతోనే బీజేపీ అధికారంలోకి వస్తుంది.

### వీబీజీ రామ్ జీ తో కేంద్రానికి పేరుస్తుందని కాంగ్రెస్ కు అక్కసు

వీబీజీ రామ్ జీపై కోర్టులో కేసు వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం దుర్మార్గం. ఈ స్కీం అమలైతే కేంద్రానికి పేరొస్తుందనే భయంతోనే అడ్డుకోవాలని చూస్తున్నారు. ఉపాధి హామీ కోసం దేశవ్యాప్తంగా రూ.8 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేశాం. తెలంగాణలోనూ రూ.39 వేల కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా ఆస్తుల సృష్టి సరిగా జరడం లేదు. వీబీజీ రామ్ జీ స్కీం ద్వారా ఆస్తులను సృష్టించబోతున్నాం. కూలీలకు కచ్చితంగా 125 రోజులు పని కల్పించబోతున్నాం. ఒకవేళ పని కల్పించకపోతే 15 రోజుల్లోనే వేతనం అందించాలని రూల్స్ లో చేర్చాం. ఇంత మంచి స్కీంను విమర్శించడం బాధాకరం. ఈ స్కీంతో రాష్ట్రంపై భారం పడుతుందని భావిస్తే ప్రధానిని కలిసి మాట్లాడాలి కదా?.

### పిల్లలకు బ్రేక్ ఫాస్ట్, 10 వేల స్కూళ్ల మూసివేత యోచన దుర్మార్గం

రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులు, టీచర్లకు బ్రేక్ ఫాస్ట్, పాలు, లంచ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ సరే... 10 వేల స్కూళ్లను మూసివేయాలనుకోవడం దారుణం. పాఠశాలలు, కాలేజీల్లో బ్రేక్ ఫాస్ట్, పాలు, లంచ్ పెట్టడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ రాష్ట్రంలో 10 వేల పాఠశాలలను మూసి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండటం మూర్ఖత్వం. తక్షణమే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి. స్కూళ్లలో చాక్ పీసులు కూడా లేవు. కనీస సౌకర్యాలు అందించి వాటిని బలోపేతం చేయాలి. తాగు, సాగునీటిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.

### సింగరేణి బొగ్గు మాయంపై విచారణ చేసే దమ్ము లేదా?

సింగరేణిలో బొగ్గు మాయంపై తక్షణమే విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాసినా ఇంతవరకు ఎందుకు విచారణ జరపడం లేదు? రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ములేదా? రాష్ట్రానికి చేతగాకపోతే కేంద్రాన్ని కోరితే విచారణ జరిపి దోషుల సంగతి చూసేందుకు మేం సిద్ధం.

# నేషనల్ లీగల్ కాంక్లేవ్‌కు విచ్చేసిన ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ కి మహిళా కాంగ్రెస్ ఘన స్వాగతం

- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

హైదరాబాద్ వెలుతురు జూలై 03:

శనివారం రోజు ఉదయం 10 గంటలకు తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న నేషనల్ లీగల్ కాంక్లేవ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు విచ్చేసిన ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అల్కా లాంబ గారికి, శుక్రవారం రోజున శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రవెల్లి సువర్ణ గారి నాయకత్వంలో, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికాము.ఈ సందర్భంగా శ్రీమతి అల్కా లాంబ గారికి తెలంగాణ గడ్డపై హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తూ, రాజ్యాంగ పరిరక్షణ, న్యాయ వ్యవస్థ బలోపేతం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ వంటి కీలక అంశాలపై నిర్వహించబడనున్న నేషనల్ లీగల్ కాంక్లేవ్ విజయవంతం కావాలని ఆకాంక్షించాము.ఈ కార్యక్రమం యువత, న్యాయవాదులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చే వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాము. డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్.



# రైతు భరోసా నిధుల విడుదలలో మరోసారి రేవంత్ ప్రభుత్వం రికార్డు

- కేవలం 4 రోజులలోనే రైతుభరోసా పథకం కింద 6590.37 కోట్లు రైతు ఖాతాలలో జమ
- ఈ రోజు 4 నుండి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రైతుభరోసా నిధుల విడుదల
- నాలుగో విడతలో 4.41 లక్షల మంది రైతుల ఖాతాలలో 1188 కోట్లు జమ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, వెలుతురు జూలై 3:

రైతుభరోసా నిధులను రైతు ఖాతాలలో వేయడంలో రేవంత్ సర్కార్ మరోసారి రికార్డు సృష్టించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జూన్ 30 న రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమం మొదలుపెట్టిన కేవలం 4 రోజులలోనే రైతు భరోసా పథకం కింద 6590.37 కోట్లను రైతుల ఖాతాలలో జమ చేసినట్టు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా పథకం కింద ఈ రోజు నాలుగో విడతలో 4 నుండి 5 ఎకరాలకు వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో నేడు రూ.



1188 కోట్లను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటికే మొదటి మూడు విడతలలో 4 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, ఈ రోజు 4 నుండి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.5402.37 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

# పలివెల లో వివాహ వేడుకలో పాల్గొన్న చలమల్ల కృష్ణారెడ్డి

- వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పలువురు నాయకులు, ఆహ్వానితుల సమక్షంలో వేడుక

మునుగోడు వెలుతురు జూలై 03:

మునుగోడులోని పలివెల వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన బోయపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆహ్వానం మేరకు ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.బోయపల్లి శ్రీనివాస్ గౌడ్ కుమారుడు సూర్యగౌడ్, శ్రావణి వివాహ వేడుకలో పాల్గొన్న చలమల్ల కృష్ణారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బంధుమిత్రులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.



# కేంద్ర నిధుల కేటాయింపులో పన్నుల వసూళ్లే పనితీరుకు కొలమానం కాకూడదు - మంత్రి సీతక్క





- ఆదివాసీ, గిరిజన, మారుమూల, వెనుకబడిన జీపీలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలి
- స్థానిక అవసరాల కోసం అన్‌టైడ్ గ్రాంట్లను కొనసాగించాలి
- 16వ ఆర్థిక సంఘం జాతీయ వర్క్‌షాప్‌లో తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి

న్యూఢిల్లీ వెలుతురు జూలై 03:

16వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన పనితీరు ఆధారిత గ్రాంట్లు, ఓన్ సోర్స్ రెవిన్యూ వంటి నిబంధనల్లో ఆదివాసి, గిరిజన, షెడ్యూల్డ్ ప్రాంతాలు, వెనుకబడిన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క కోరారు. గ్రామ పంచాయతీల పనితీరును కేవలం పన్నుల వసూళ్లతోనే అంచనా వేయకుండా, ప్రజలకు అందిస్తున్న సేవలు, పారిశుధ్యం, పారదర్శకత, డిజిటల్ పాలన, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.16వ ఆర్థిక సంఘం గ్రామీణ స్థానిక సంస్థల సిఫార్సులపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో మంత్రి సీతక్క తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయాలను వివరించారు. స్పెషల్ సీఎస్ దానకిషోర్ తో పాటు ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...జీపీలకు పనితీరు ఆధారిత గ్రాంట్లను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని, అయితే ఆదాయ సామర్థ్యం తక్కువగా ఉన్న ఆదివాసీ, గిరిజన, మారుమూల ప్రాంతాల గ్రామ పంచాయతీలపై అదనపు పన్నుల భారం మోపే విధంగా నిబంధనలు ఉండకూడదన్నారు. అభివృద్ధిని ప్రజల ఆర్థిక స్థితితో ముడిపెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామ పంచాయతీల జనాభా చాలా తక్కువగా ఉండటంతో వాటి సొంత ఆదాయ వనరులు కూడా పరిమితంగానే ఉంటాయని తెలిపారు. అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని, ఆదివాసీ, గిరిజన, షెడ్యూల్డ్ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండల స్థాయి స్థానిక సంస్థలకు కూడా పనితీరు గ్రాంట్ల అర్హతలో వెసులుబాటు కల్పించాలని కోరారు.న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా ఎన్నికలు జరగని 62 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి నిధులు నిలిపివేయడం వల్ల అక్కడి ప్రజలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల వల్ల ఎన్నికలు ఆలస్యమైన ప్రత్యేక పరిస్థితుల్లో నిధులు కొనసాగించేలా నిబంధనలు ఉండాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి గ్రామ అవసరం భిన్నంగా ఉంటుందని, అందువల్ల స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయాలు తీసుకునేలా అన్‌టైడ్ బేసిక్ గ్రాంట్లను తగిన స్థాయిలో కొనసాగించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. డిజిటల్ గవర్నెన్స్, ఈ-గ్రామ్ స్వరాజ్, పీఎఫ్ఎంఎస్ వంటి వ్యవస్థలను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని... వాటి అమలుకు అవసరమైన శిక్షణ, సిబ్బంది, ఇంటర్నెట్ కనెక్టివిటీ, సాంకేతిక మౌలిక వసతులను మారుమూల గ్రామాల్లో కేంద్రం బలోపేతం చేయాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాలు, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల్లో ప్రజా సేవలను అందచేసేందుకు అధిక వ్యయం అవుతున్నందున నిధుల కేటాయింపులో అలాంటి ప్రాంతాలకు ప్రత్యేక వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. బలమైన గ్రామ పంచాయతీలు, బలమైన రాష్ట్రాలు కలిసి బలమైన భారత నిర్మాణానికి పునాది వేస్తాయని మంత్రి సీతక్క అన్నారు. బలమైన గ్రామ పంచాయతీలు, బలమైన రాష్ట్రాలు కలిసి బలమైన భారత నిర్మాణానికి పునాది వేస్తాయని మంత్రి సీతక్క అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలంటే రాష్ట్రాలకు తగిన ఆర్థిక సామర్థ్యం ఉండాలని, సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను బలోపేతం చేస్తూనే పంచాయతీలను మరింత శక్తివంతం చేసే విధంగా 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు ఉండాలని మంత్రి సీతక్క సూచించారు.

# తెలంగాణలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

- వర్షాకాలం ముగియగానే మూడు షిఫ్టుల్లో పనులు
- యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణానికి మంత్రి యాక్షన్ ప్లాన్

హైదరాబాద్ వెలుతురు జూలై 03:

తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పలు ప్రతిష్టాత్మక పనుల పురోగతిపై ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో ఉన్నతాధికారులతో ఒక సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌అండ్‌బీలోని అన్ని విభాగాల వారీగా పనుల పురోగతిపై మంత్రి కూలంకషంగా చర్చించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నడుస్తున్న కీలక ప్రాజెక్టులు ఏ దశలో ఉన్నాయి, నిధుల వినియోగం ఎలా ఉందనే విషయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా పనులు ఆలస్యం కాకుండా వేగం పెంచాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా "న భూతో న భవిష్యత్" రీతిలో అద్దం లాంటి నాణ్యమైన రోడ్ల నిర్మాణానికి సంకల్పించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగానే ఇటీవల నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని పనులను అధికారికంగా ప్రారంభించామని గుర్తుచేశారు. రానున్న రెండేళ్ల కాలంలో తెలంగాణలోని ఏ మూలన చూసినా నాణ్యమైన ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్లే కనిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "మంచి రోడ్డు – ప్రగతికి సూచిక" అని తాము బలంగా నమ్ముతున్నామని, దీనివల్ల పల్లెలకు, పట్టణాలకు రవాణా సదుపాయం పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పరిశ్రమలు వస్తాయని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని వివరించారు.రాష్ట్రవ్యాప్త రహదారుల నెట్‌వర్క్ ఆధునికీకరణ కోసం మొదటి ఫేజ్‌లో సుమారు రూ. 13,000 కోట్ల భారీ అంచనా వ్యయంతో మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవునా రోడ్ల పనులను 34 ప్యాకేజీలుగా విభజించి చేపట్టబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుత జూలై నెలలోనే 10 ప్యాకేజీలకు సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2 పరిధిలో సుమారు రూ. 155 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 42 కిలోమీటర్ల పొడవైన నల్లగొండ – మహబూబ్‌నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే మొదలయ్యాయని, ఈ పనుల వేగాన్ని మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని, అయినప్పటికీ రాబోయే రోజుల్లో వర్షాకాలం పూర్తిగా ముగిసిన వెంటనే రోడ్ల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో కూడా కలిపి మొత్తం మూడు షిఫ్టులలో పనులు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పనుల పర్యవేక్షణ కోసం సాంకేతిక నైపుణ్యం ఉండి, నిరంతరం ఫీల్డ్‌లోనే ఉండేలాంటి సమర్థులైన ఇంజినీర్లను ఎంపిక చేసి ప్యాకేజీల వారీగా బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ఇచ్చిన గడువులోగా పనులను నాణ్యతతో పూర్తి చేయించడం చీఫ్ ఇంజినీర్ల పూర్తి బాధ్యత అని తేల్చిచెప్పారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 6వ తేదీన కరీంనగర్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే హ్యామ్ , అలాగే సీఆర్ఎఫ్ రోడ్ల పనులకు భూమిపూజ చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఆ జిల్లాకు చెందిన మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి తానే స్వయంగా ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటానని వెల్లడించారు. ఈ లోపే దానికి సంబంధించిన అన్ని రకాల అధికారిక ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాజేంద్రనగర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవనం, జడ్జిల నివాస సముదాయాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిరంతర నిఘా ఉంచారని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు అక్కడ కేవలం 16 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని అధికారులు వివరించగా, మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై మూడు షిఫ్టుల్లో పనులు జరగాలని, కార్మికుల సంఖ్యను భారీగా పెంచి నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకోవాలన్నారు. అక్కడ ఆర్‌అండ్‌బీ తరఫున పర్యవేక్షించే ఇంజినీర్ల సంఖ్యను కూడా పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి కొత్త హైకోర్టు భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని డెడ్‌లైన్ విధించారు. అదేవిధంగా, చారిత్రాత్మక ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనుల్లో కూడా వేగం పెంచి, దానిని కూడా 2027 డిసెంబర్ నాటికే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులపైన కూడా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష చేశారు. సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి భవనం ఇప్పటికే పూర్తిగా నిర్మాణమై ప్రారంభానికి సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. దీనితో పాటు అల్వాల్ టిమ్స్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పనులతో పాటు వరంగల్‌లో నిర్మిస్తున్న అతిపెద్ద మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను వేగవంతం చేయాలని అధికారులను పురమాయించారు. ఈ ప్రాజెక్టులన్నీ అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా రాత్రింబవళ్లు శ్రమించాలని సూచించారు.

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ మెగా ప్రాజెక్టుల్లో కేవలం టెక్నికల్ నాలెడ్జ్ ఉండి, మనసుపెట్టి పనిచేసే నిబద్ధత (కమిట్‌మెంట్) గల ఇంజినీర్లను మాత్రమే నియమించాలని మంత్రి ఉన్నతాధికారులకు సూచించారు. తానే స్వయంగా ఈ వారం నుంచే నిర్మాణాలు జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక సైట్ విజిట్స్ (సైట్ తనిఖీలు) చేస్తానని స్పష్టం చేశారు. పనుల పురోగతిలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహించినట్లు లేదా నాణ్యత లోపించినట్లు తన దృష్టికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర, భద్రాచలం ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం ఆర్‌అండ్‌బీ తరపున చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా మంత్రి ఆరా తీశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సీ జయ భారతి, అన్ని విభాగాల సీఈలు బీవీ రావు, రాజేశ్వర్ రెడ్డి, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, వనజ, రాజేందర్, నర్సింగ్ రావు మరియు పలువురు ఆర్‌అండ్‌బీ ఉన్నత శ్రేణి ఇంజినీర్లు పాల్గొన్నారు.

# కవిత అరెస్ట్‌పై స్వతంత్ర దర్యాప్తు జరపాలి: డీజీపీకి తెలంగాణ రక్షణ సేన ఫిర్యాదు

హైదరాబాద్, వెలుతురు జూలై 03:

బోడుప్పల్‌లో నిర్వహించిన భూ పోరాటం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అరెస్ట్ సమయంలో పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని ఆరోపిస్తూ పార్టీ నాయకులు డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు.టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాము యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీజీపీని కలిసిన నాయకులు, కవితతో పాటు మహిళా నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడారని ఆరోపించారు.శాంతియుతంగా చేపట్టిన నిరసనపై పోలీసులు కక్ష పూరితంగా వ్యవహరించారని పేర్కొన్నారు.ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరిన నాయకులు, అరెస్ట్ సందర్భంగా జరిగిన తోపులాట, ఉద్రిక్తతకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను ఫిర్యాదుకు జత చేసినట్లు తెలిపారు.



# అంతరంగ శాంతి.. విశ్వక్రాంతి!

ఉదయాన్నే నిద్రలేవగానే వేడివేడి కాఫీ కప్పుతో పాటు చేతిలోకి వచ్చే దినపత్రికలను ఒకసారి తిరగేస్తే మనకు ఏం కనిపిస్తుంది? యుద్ధోన్మాదం, సరిహద్దుల్లో ఘర్షణలు, సమాజంలో రోజురోజుకూ పెచ్చురిల్లుతున్న అసహనం, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ద్వేషపూరిత ప్రచారాలు ఇవే ఈనాటి దినచర్యలో ముఖ్యాంశాలు. ఆధునిక ప్రపంచం రోజురోజుకూ మరింత గందరగోళంగా, తీవ్రమైన అశాంతితో కొట్టుమిట్టాడుతున్నట్టు అనిపించడం సహజం. గ్లోబలైజేషన్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా పెరుగుతున్నా, మనుషుల మధ్య ఉండాల్సిన మానసిక బంధాలు, సాన్నిహిత్యం మాత్రం క్రమంగా అంతరించిపోతున్నాయి.ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో సగటు మనిషి మనసులో ఒక ప్రాథమిక ప్రశ్న తలెత్తుతుంది. ఈ విశాలమైన, కోట్లాది మంది జనాభా ఉన్న ప్రపంచంలో, కేవలం నా ఒక్కడి మనసు ప్రశాంతంగా ఉంటే ఏం మారుతుంది? నా అంతరంగ శాంతి ఈ సమాజంలోని అల్లకల్లోలాన్ని మార్చగలదా? అనేది ఆ ప్రశ్న. ఇది కేవలం తత్వశాస్త్రానికి సంబంధించిన చిక్కుముడి మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో, ఏదో ఒక ఒంటరి క్షణంలో ఎదుర్కొనే అత్యంత వాస్తవికమైన మానసిక సందిగ్ధత.ప్రకృతి నియమాలను నిశితంగా గమనిస్తే మనకు ఒక అద్భుతమైన సత్యం బోధపడుతుంది. సృష్టిలో సంభవించే ప్రతి బృహత్తర మార్పు కూడా ఎక్కడో ఒక చిన్న అనామక బీజం నుంచే అంకురిస్తుంది. నింగికెగసే మహా వృక్షమైనా ఒకనాడు మట్టిలో దాగున్న చిన్న గింజ మాత్రమే కదా! అదేవిధంగా, మానవ సమాజంలో వెల్లువెత్తిన ప్రతి విప్లవాత్మక పరివర్తన వెనుక, ఎవరో ఒక వ్యక్తి అంతరంగంలో మొలకెత్తిన ఆలోచనా స్రవంతి మాత్రమే మూలకారణంగా ఉంటుంది.ఉదాహరణకు, మహాత్మా గాంధీ అనే ఒకే ఒక్క వ్యక్తి మనసులో అహింస పట్ల అంతటి దృఢమైన, అచంచలమైన నమ్మకం కలగకపోతే భారత స్వాతంత్ర్య సంగ్రామం సరికొత్త చరిత్రను లిఖించేదా? అలాగే, సిద్ధార్థుడు తన రాజ భోగాలను త్యజించి, అంతర్మథనంతో తన లోపల శాంతిని అన్వేషించకపోతే, వేల సంవత్సరాలుగా కోట్ల మందికి జీవన మార్గం చూపుతున్న బౌద్ధ ధర్మం ఉద్భవించేదా? కాబట్టి, ఒక్కరి మనసు మారితే ఏమౌతుంది? అనే



నిరాశావహ ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పింది. ఒక్క మనసు విశ్వాన్ని సైతం కదిలించగలదు.మనం నిత్యం చూసే బాహ్య ప్రపంచం మరేదో కాదు, మన అంతరంగ స్థితికి అద్దం పట్టే ప్రతిబింబం మాత్రమే. మనస్సులో క్రోధాగ్ని రగులుతున్నప్పుడు, మనం మాట్లాడే మాటల్లో కరుకుదనం, పరుషత్వం వాటంతట అవే వచ్చేస్తాయి. అంతరంలో అసూయ, ద్వేషాలు నిండినప్పుడు బంధాలలో అపార్థాల చిక్కుముడులు బిగుసుకుంటాయి. మనసులో తెలియని భయాందోళనలు ఉన్నప్పుడు మనం తీసుకునే నిర్ణయాలు సైతం తప్పుదారి పడతాయి.ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. ఒక కుటుంబంలో తల్లిదండ్రుల మనసు అశాంతితో నిండి ఉంటే, ఆ ఇల్లాలు లేదా యజమాని ప్రవర్తన వల్ల ఇల్లే ఒక యుద్ధప్రాంతంగా మారుతుంది. అదేవిధంగా, ఒక కార్పొరేట్ ఆఫీసులో లీడర్ మనసు స్థిరంగా లేకపోతే, ఆ గందరగోళం టీమ్ మొత్తాన్ని నిరాశలోకి నెట్టేస్తుంది. అంటే, ప్రతి వ్యక్తి తన మానసిక స్థితిని బట్టి చుట్టూ ఒక అదృశ్య వలయాన్ని, వాతావరణాన్ని సృష్టిస్తాడు. అది ఆనందమయమైనా కావచ్చు, లేదా అల్లకల్లోలమైనా కావచ్చు. ఈ కోణంలో విశ్లేషిస్తే, ఒక వ్యక్తి మానసికంగా ప్రశాంతంగా ఉండటం అనేది అతని స్వార్థం కాదు, అది సమాజానికి చేసే గొప్ప మేలు.నిశ్చలంగా ఉన్న ఒక చెరువు నీటిలో చిన్న రాయి వేస్తే, అది సృష్టించే తరంగాలు ఒడ్డు వరకు ఎలా ప్రయాణిస్తాయో మనందరికీ తెలుసు. మనిషి మనస్సు కూడా అచ్చం అలాంటి తరంగాల కేంద్రమే. ప్రశాంతమైన చిత్తం నుండి వెలువడే ప్రతి ఆలోచన, ప్రతి సానుకూల పలకరింపు చుట్టుపక్కల వారికి ఎనలేని శ్రేయస్సును ఇస్తాయి. ఒక వ్యక్తి సంక్షోభ సమయంలో సైతం తన కోపాన్ని అదుపులో ఉంచుకుని శాంతంగా స్పందిస్తే, ఎదుటివారిలోని ఆగ్రహం కూడా మంచులా కరిగిపోతుంది. వైరస్‌లు వ్యాప్తి చెందినట్టే, మనుషుల మానసిక భావాలు కూడా ఒకరి నుండి మరొకరికి పరోక్షంగా వ్యాపిస్తాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. సమాజంలో ద్వేషం ఎంత వేగంగా విస్తరిస్తుందో, అంతకంటే శక్తివంతంగా శాంతి కూడా వ్యాపించగలదని ఈ సిద్ధాంతం నిరూపిస్తోంది.

అయితే, ఇక్కడ మనం ఒక ముఖ్యమైన వాస్తవాన్ని విస్మరించకూడదు. కేవలం ఒక వ్యక్తి గదిలో కూర్చుని ప్రశాంతంగా ధ్యానం చేస్తే ప్రపంచంలోని యుద్ధాలు ఆగిపోతాయని, పేదరికం నిర్మూలించబడుతుందని భావించడం అమాయకత్వమే అవుతుంది. ఈ సమాజంలో అనేక నిర్మాణాత్మక సమస్యలు ఉన్నాయి. ఆర్థిక అసమానతలు, రాజకీయ కుతంత్రాలు, చారిత్రక వైరుధ్యాలు అంత సులభంగా తొలగిపోవు. వీటన్నింటికీ సామూహిక పోరాటాలు, వ్యవస్థాగత మార్పులు, పటిష్టమైన విధానాలు అవసరం. కేవలం అంతరంగ శాంతి మాత్రమే వీటికి తక్షణ పరిష్కారం చూపలేదు.

కానీ, ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. ఆ వ్యవస్థాగత మార్పులను తీసుకువచ్చే చైతన్యవంతమైన నాయకులు కూడా మనుషులే కదా! ఒక ప్రశాంతమైన, వివేకవంతమైన మనసు ఉన్న నాయకుడు మాత్రమే సుదూర దృష్టితో, సహనంతో సరైన నిర్ణయాలు తీసుకోగలడు. క్రోధంతో, అహంతో ఊగిపోయే మనసులు తీసుకునే నిర్ణయాలు ఎంతటి ఘోర విధ్వంసాలకు దారితీస్తాయో చరిత్ర మనకు ఎన్నో పాఠాలు నేర్పింది.అందుకే, నా మనసు మారితే ఈ ప్రపంచం మొత్తం మారుతుందా? అని ప్రశ్నించుకునే బదులు, నా మనసు మారకుండా ఈ సమాజం ఎలా మారుతుంది? అని ఆలోచించడం సమంజసం. ప్రతి గొప్ప సామాజిక ఉద్యమం వెనుక కొద్దిమంది వ్యక్తుల అంతరంగ స్పష్టత దాగి ఉంది. చీకటిని తిట్టడం కంటే ఒక చిన్న దీపం వెలిగించడం మిన్న అంటారు. ఒక చిన్న దీపం మరో దీపాన్ని వెలిగిస్తుంది, ఆ దీపాల వరుస క్రమంగా దీపావళిగా మారుతుంది. అలాగే, ఒక్క ప్రశాంత మనసు ఇచ్చే స్ఫూర్తి సమాజంలో నిశ్శబ్ద విప్లవానికి నాంది పలుకుతుంది.మనసు ప్రశాంతంగా ఉంటే రేపే ప్రపంచం మారిపోదు. కానీ ప్రశాంతత లేకుండా ఏ కొత్త మార్పుకూ పునాది పడదు. ప్రతి జీవనదికి మూలం ఒక చిన్న ఊటబావి మాత్రమే. ప్రతి చారిత్రక పరిణామానికి మూలం ఒక మనిషి అంతరంగంలో పుట్టే ప్రశాంత చింతన. కాబట్టి, లోకాన్ని సంస్కరించాలని ఆరాటపడే ముందు, మన అంతరంగాన్ని ప్రశాంతపరుచుకోవడం నేర్చుకుందాం. అది ఖచ్చితంగా ఒక అద్భుతమైన జీవన ప్రయాణానికి ఆరంభం అవుతుంది. మనసే జగత్తుకు మూలం!



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# 20 ఏండ్ల రేవంతన్న పయనం – ఒక పరిశీలన!

ప్రజాప్రతినిధిగా మొదటి అడుగు వేసిన నేలను, తనను గెలిపించిన ప్రజలను ఎన్నేళ్లు గడిచినా మరవకపోవడం రాజకీయాల్లో అరుదైన విషయం. చాలా మంది నాయకులు అధికార శిఖరాలకు చేరిన తర్వాత తమ రాజకీయ మూలాలను మరచిపోతారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పేందుకు స్వయంగా అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకోవడం ఆయన రాజకీయ సంస్కారానికి నిదర్శనంగా నిలుస్తోంది. జులై 4తో ప్రజాప్రతినిధిగా రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తవుతోంది. 2006లో మిడ్జిల్ జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచి ప్రజాసేవలో తొలి అడుగు వేసిన ఆయన... ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, చివరకు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎదిగారు. అయితే ఆ విజయాల వెనుక నిలిచిన మొదటి మెట్టును, తనను నమ్మి ఆశీర్వదించిన మిడ్జిల్ ప్రజలను మరచిపోకుండా కృతజ్ఞతా సభ నిర్వహించాలని నిర్ణయించడం ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతోంది.

"వెయ్యి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది" అనే సామెతను రేవంత్ రెడ్డి రాజకీయ జీవితం అక్షరాలా నిజం చేసింది. వంగూరు ఆయన స్వస్థలం అయినప్పటికీ, జడ్పీటీసీ స్థానం రిజర్వేషన్ కారణంగా మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. అప్పట్లో టీడీపీ, బీజేపీ, వామపక్షాల మద్దతుతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించి ఘన విజయం సాధించారు. ఆ గెలుపు సాధారణ ఎన్నికల విజయం కాదు. తెలంగాణ రాజకీయాల్లో ఓ కొత్త నాయకుడి ఆవిర్భావానికి నాంది. అదే విజయాన్ని పునాదిగా చేసుకుని 2007లో స్వతంత్ర అభ్యర్థిగానే ఎమ్మెల్సీగా గెలిచారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి కొడంగల్ ఎమ్మెల్యేగా వరుస విజయాలు సాధించారు. 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లో గుర్తింపు పొందారు. 2021లో తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, 2023లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. ఈ 20 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, రాజకీయంగా ఎక్కడా వెనక్కి తగ్గకుండా ప్రతి సవాలును అవకాశంగా మలుచుకోవడం రేవంత్ రెడ్డి ప్రత్యేకతగా నిలిచింది.

**తొలి అడుగు వేసిన నేలకు నమస్కారం**

రాజకీయాల్లో గెలుపు సాధించిన తర్వాత ప్రజల వద్దకు కృతజ్ఞతలు చెప్పడానికి తిరిగి వెళ్లడం చాలా అరుదుగా కనిపించే సంప్రదాయం. కానీ రేవంత్ రెడ్డి మాత్రం తనను మొదటిసారి ప్రజాప్రతినిధిని చేసిన మిడ్జిల్ ప్రజల రుణం తీర్చుకోవాలని భావిస్తున్నారు. "మీ బిడ్డను మళ్లీ మీ ముందుకు వచ్చాను... మీ ఆశీర్వాదాలతోనే రాష్ట్రానికి సేవ చేసే అవకాశం వచ్చింది" అనే భావనతో మిడ్జిల్ ప్రజలను కలవాలని నిర్ణయించడం ఆయన రాజకీయ విలువలను ప్రతిబింబిస్తోంది. ఈ సందర్భంగా ముందుగా ఊరుకొండ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం తన తొలి రాజకీయ ప్రయాణంలో వెన్నంటి నిలిచిన కార్యకర్తలు, స్నేహితులు, పెద్దలతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొంటారు. తర్వాత మిడ్జిల్‌లో జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అలాగే స్థానిక నాయకుడు గోపాల్ రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ సభకు వేలాదిమంది హాజరుకానున్నారని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏర్పాట్లను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రాజకీయాల్లో అవకాశాలు అందరికీ వస్తాయి. కానీ వాటిని చరిత్ర సృష్టించే అవకాశాలుగా మలచుకునే వారు కొందరే. రేవంత్ రెడ్డి అలాంటి నాయకుడు. విద్యార్థి దశలో ఏబీవీపీ ద్వారా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన ఆయన, ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంకృషితో ఎదిగారు. రాజకీయాల్లో ప్రత్యక్ష ప్రవేశానికి అవకాశం వచ్చినప్పుడు ఏ పార్టీ గుర్తు లేకుండానే స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళ్లి విజయం సాధించారు. ఆ తర్వాత ప్రతి ఎన్నికను ఒక కొత్త మెట్టుగా మార్చుకున్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు, చివరకు ముఖ్యమంత్రి వరకు ఎదిగిన ఆయన రాజకీయ ప్రయాణం యువతకు ఆదర్శంగా నిలిచింది. రేవంత్ రెడ్డి రాజకీయ జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ఓటములు చూశారు. విమర్శలు ఎదుర్కొన్నారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. కొడంగల్‌లో ఓటమి ఎదురైనా నిరాశ చెందకుండా వెంటనే మల్కాజ్‌గిరి నుంచి లోక్‌సభకు పోటీ చేసి ఘన విజయం సాధించారు. తెలంగాణ కాంగ్రెస్ బలహీనంగా ఉన్న సమయంలో పార్టీ బాధ్యతలు చేపట్టి గ్రామ గ్రామాన తిరిగి కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం నింపారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌ను మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లి, బలమైన ప్రత్యామ్నాయంగా నిలబెట్టారు. ఒక దశలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా బలహీనపడిపోయిందనే అభిప్రాయం ఏర్పడింది. అలాంటి సమయంలో పార్టీ పగ్గాలు చేపట్టిన రేవంత్ రెడ్డి, క్షేత్రస్థాయిలో పార్టీని పునర్నిర్మించారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, పాదయాత్రలు, సభలు, ఉద్యమాలతో కాంగ్రెస్‌కు కొత్త ఉత్సాహం తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు పార్టీకి కొత్త శక్తిని అందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చి అధికారంలోకి తీసుకురావడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషించింది. ఆ విజయానికి గుర్తింపుగానే కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను ముఖ్యమంత్రి చేసింది.

**ముఖ్యమంత్రిగా కొత్త దిశ**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి పరిపాలనలో వేగాన్ని పెంచారు. ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యం ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో అభివృద్ధి రంగంలోనూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు, భూభారతి పోర్టల్, రెవెన్యూ సంస్కరణలు, విద్యా రంగంలో మార్పులు, ఉద్యోగాల భర్తీ, పరిశ్రమల ప్రోత్సాహం వంటి అనేక నిర్ణయాలతో తెలంగాణను కొత్త దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కొనసాగిస్తూ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలోనూ చురుకుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా తన తొలి విజయాన్ని గుర్తు చేసుకుంటూ మిడ్జిల్ ప్రజల ముందుకు వెళ్లడం రాజకీయంగా ఒక ప్రత్యేక సందేశంగా మారింది. రాజకీయాల్లో పదవులు మారొచ్చు... పార్టీలు మారొచ్చు... కానీ ప్రజల ఆశీర్వాదంతో మొదలైన ప్రయాణాన్ని మరచిపోకూడదనే సందేశాన్ని రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమం ద్వారా ఇస్తున్నారు. 20 ఏళ్ల క్రితం సాధారణ జడ్పీటీసీ సభ్యుడిగా ప్రారంభమైన ప్రస్థానం... నేడు తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం వెనుక ప్రజల విశ్వాసం, నిరంతర శ్రమ, పట్టుదల, రాజకీయ దూరదృష్టి ఉన్నాయని ఆయన ప్రయాణం స్పష్టంగా చెబుతోంది. మిడ్జిల్ సభ కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. అది ఒక నాయకుడు తన తొలి అడుగును గుర్తు చేసుకుంటూ, తనను గెలిపించిన ప్రజలకు తలవంచి కృతజ్ఞతలు చెప్పే అరుదైన భావోద్వేగ ఘట్టం. తెలంగాణ రాజకీయ చరిత్రలో ఈ కార్యక్రమం రేవంత్ రెడ్డి ప్రజలతో కొనసాగిస్తున్న అనుబంధానికి, ఆయన రాజకీయ సంస్కారానికి మరో గుర్తింపుగా నిలవడం ఖాయం.



సత్తు మల్లేష్, కరీంనగర్ జిల్లా
గ్రంథాలయ కమిటీ చైర్మన్.

# టిఫిన్లు, భోజనాలు వద్దు, పి ఆర్ సి ఇవ్వండి

- టియుటిఎఫ్ డిమాండ్

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 3 :**







రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అందించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మ లచ్చిరాం, పి.రఘునందన్ రెడ్డిలు ఒక ప్రకటన లో తెలిపారు. ఉపాధ్యాయులకు, అల్పాహారం, భోజనం కాదు, పి ఆర్ సి, డి ఏ లు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఒక లక్ష 50 వేల మంది ఉపాధ్యాయ, అధ్యాపకుల మీద భోజనానికి పెట్టే ఖర్చు విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించడానికి ఖర్చు పెట్టాలని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయకుండా భోజనం పెడతామనడం, భీమా కల్పిస్తామనడం వంటి వాటిని ముందుకు తీసుకురావడం సరికాదన్నారు. అసలైన సమస్యలను ప్రక్క దారి పట్టించడమే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలి..డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి

- రెయిన్‌బో స్కూల్‌లో ఘనంగా 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమం – ప్రజారోగ్య పరి రక్షణకు అధికారుల పిలుపు...

**కూకట్ పల్లి, జూలై 03 వెలుతురు:**



డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో పాపిరెడ్డి నగర్‌లోని రెయిన్‌బో స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరి మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండే కుండీలు, కూలర్లు, టైర్లు, నీటి పాత్రలను తప్పనిసరిగా ఖాళీ చేసి శుభ్రపరిస్తే దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాదిగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ సునీత, లక్ష్మీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మి, ఎంటమాలజీ విభాగం అధికారి నరేష్, వైద్యాధికారి నాగేష్, జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రతి కుటుంబం "ఫ్రైడే డ్రై డే"ను క్రమం తప్పకుండా పాటించి తమ ఇల్లు, కాలనీని దోమల రహితంగా ఉంచాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ భాగస్వాములైతేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని అన్నారు. స్కూల్ కరస్పాండెంట్ విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ద్వారా ప్రతి ఇంటికి ఆరోగ్య సందేశాన్ని చేరవేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కూడా దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారి నాగేష్ మాట్లాడుతూ, వారానికి ఒక రోజు కేవలం పది నిమిషాలు కేటాయించి నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశీలించి శుభ్రం చేస్తే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని వివరించారు. ఎంటమాలజీ విభాగం అధికారి నరేష్ దోమల లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తించే విధానం, లార్వా నియంత్రణ చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు "ప్రతి శుక్రవారం – ఫ్రైడే డ్రై డే"ను తప్పనిసరిగా పాటిస్తూ దోమల నివారణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పేర్ని ధర్మారావు, తాటి కిరణ్, ఏ. ప్రభాకర్, సీహెచ్. సత్యనారాయణ రెడ్డి, జి. వసంత రెడ్డి, జాల శంకర్ రెడ్డి, పి. లక్ష్మణ్, గోపాల్, దాకూరి తిరుపతి రెడ్డి, బాల నరసింహ, పి. లక్ష్మి, ఎస్. సులోచన తదితరులు పాల్గొన్నారు.

# "శ్రీ అక్షయ కలెక్షన్స్" నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం

- ముఖ్యఅతిథిగా వడ్డేపల్లి విద్య విజయేందర్ రెడ్డి నాలుగవ వార్డ్ కౌన్సిలర్, హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

**ఎల్బీనగర్ వెలుతురు జులై 3,**





విగ్నేశ్వర నగర్ కాలనీ ఏవన్ బేకరీ సమీపంలో అక్షయ కలెక్షన్ బ్రాంచ్ ప్రారంభోత్సవం నిర్వాహకులు: యాదగిరి గౌడ్, మాట్లాడుతూ మా ప్రత్యేకతలు, ఆల్ టైప్స్ ఆఫ్ శారీస్,సిల్క్ శారీస్, కాటన్ శారీస్ ,బనారస్ శారీస్ ,వెడ్డింగ్ సారీస్, ప్రారంభోత్సవం సందర్భంగా ఒక వారం 10% శాతం డిస్కౌంట్ అందిస్తున్న మా బ్రాంచ్ , ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచు కోవాలని విజ్ఞప్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. గోపాల్ గౌడ్, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొ ని జయవంతం చేశారని తెలియజేశారు.

# ఆరుట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కోరే యాదయ్య కుటుంబానికి క్వింటాల్ బియ్యం పంపిణీ చేసిన బిఆర్ఆర్ ఫౌండేషన్

- పేద ప్రజలకు ఎల్లప్పుడూ బిఆర్ ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుంది ఫౌండేషన్ సభ్యుడు పున్నం రాము

**మంచాల వెలుతురు జులై 03:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఆరోగ్యంతో మృతి చెందిన కోరే యాదయ్య కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్అర్ ఫౌండేషన్ సభ్యులు అనంతరం కోరే యాదయ్య దశ దినకర్మ కార్యక్ర మానికి సహాయంగా బిఅర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు క్వింటాలు బియ్యాన్ని పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు పున్నం రాము మాట్లాడుతూ పేదప్రజలకు ఎటువంటి ఆపద క లిగిన ఏ అవసరం వచ్చిన బిఅర్ఆర్ ఫౌండేషన్ మరియు ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డిఅం దగా ఉంటారని అన్నారు ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ మానిపాటి శోభకుమార్ బిఅర్ ఆర్ ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ సద్దాం వెంకటేష్ శివ మహేష్ యాదయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ లక్ష్మీనరసింహ మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ప్రారంభోత్సవం

**ఎల్బీనగర్, వెలుతురు జులై 3:**



హయత్ నగర్ బొడ్రాయి సమీపంలో లక్ష్మీ నరసింహ మెడికల్ జనరల్ నూతన బ్రాంచ్ ప్రారంభం నిర్వాహకులు లక్ష్మీ నరసింహ మాట్లాడుతూ అనేక రకాల మందులు అందుబాటులో లభించును హోం డెలివరీ సదుపాయాన్ని కల్పించాము 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్న మా మెడికల్ షాప్ అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో బంధుమి త్రుడు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# నేడు మంచాల మండలం వివిధ గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

- ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే గారి కార్యక్రమానికి హాజరు కావాలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి

**మంచాల వెలుతురు జులై 03:**



మంచాల మండలం కేంద్రంలోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుఎడ్మ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నేడు మంచాల మండలం వివిధ గ్రామాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముందుగాఉ.11గం.లకు నోములలో సీసీరోడ్లు ప్రారంభోత్సవాలు ఎరువుల పంపిణీ కేంద్రం ప్రారంభోత్సవం ఉ.11.30గం.లకు మంచా లలో రైతులకు బోరుమోటార్ల పంపిణీ కార్యక్రమం మ.12 గం.లకు ఆరుట్లలో సీసీ రోడ్లకు శంకు స్థాపనలు కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవం మ12.30గం.లకు రంగాపూర్మినీ గురుకులంలో తరగతి గదుల ప్రారంభోత్సవాలుమ 1.00గం.లకు ఎల్లమ్మ తాండలో సీసీ రోడ్లు శంకుస్థాపన మ 1.30 గం.లకు బోడకొండలో ఎరువుల పంపిణీ కేంద్రంప్రారంభోత్సవం మ.2.00 గం.లకు లోయపల్లిలో సీసీ రోడ్లు భూగర్భడ్రైనేజీ శంకుస్థాపన కార్యక్రమం ప్రారంభిస్తారు అనిఅన్నారు ముంచాల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లు వార్డు సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు వివిధ గ్రామా ల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు.మీడియామిత్రు లు ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు

# బాచుపల్లిలో పూజిత ఎంక్లేవ్ లో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 03:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి పూజిత ఎంక్లేవ్ ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరే విధంగా కృషి కొనసాగుతోందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళల అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలమని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల పాత్రను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈకార్యక్రమంలో డ్వాక్రా గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, యశోద, శ్రీవాణి, జ్యోతి, కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు ఆరుట్ల గ్రామంలో కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవం వివిధ గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

- రైతులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ ప్రారంభోత్సవానికి హాజరు కావాలి
- మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**మంచాల వెలుతురు జులై 03:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కూరగాయల మార్కెట్ పరిశీలించిన! మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సందర్భంగా వారు మాట్లా దుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో మంచాల వ్యవసాయ సహకారసంఘం వారి ఆధ్వర్యంలో రైతులు కూరగాయలు అమ్ము కోవడానికి అన్నిసౌకర్యాలతో మంచాల మండలంలోనే ఒక పెద్ద కూరగాయల మార్కెట్ ఆరుట్ల గ్రామంలో నిర్మించాం అని అన్నారు రాబోయే రోజుల్లో ఆరుట్ల కూరగాయల మార్కెట్ పెద్ద మార్కెట్ గా అభివృద్ధి చెందుతుం ది అని అన్నారు నేడు ఆరుట్లలో కూరగాయల మార్కెట్.సీసీ రోడ్లు ప్రారంభోత్సవం చేయడానికి మన ప్రియతమ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విచ్చేస్తున్నారు అలాగే మంచాల మండలం వివిధ గ్రామాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ఇబ్ర హీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముందుగా ఉ11గం.లకునోములలో సీసీరోడ్లు ప్రారంభోత్సవాలు ఎరువుల పంపిణీ కేంద్రంప్రారంభోత్సవం ఉ.11. 30గం.లకు మంచాలలో రైతులకు బోరు మోటార్ల పంపిణీ కార్యక్రమం మ.12 గం.లకు ఆరుట్లలో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు కూర గాయల మార్కెట్ ప్రారంభోత్సవం మ12. 30గం.లకు రంగాపూర్ మినీగురుకులంలో తరగతి గ దులప్రారంభోత్సవాలు మ.1.00గం.లకు ఎల్లమ్మతాండలో సీసీ రోడ్లు శంకుస్థాపన మ1.30గం లకు బోడకొండలోఎరువుల పంపిణీ కేంద్రంప్రారంభోత్సవం మ.2.00 గం.లకు లోయపల్లిలో సీసీ రోడ్లు భూగర్భడ్రైనేజీ శంకుస్థాపన కార్యక్రమం ప్రారంభిస్తారు అనిఅన్నారు ముంచాల మం డలం లోని వివిధ గ్రామాల సర్పంచ్ లు వార్డు సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాల కాంగ్రె స్ పార్టీగ్రామశాఖ అధ్యక్షులు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని అ ని అన్నారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆరుట్లగ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముది రాజ్ ఇందిరమ్మకమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ మంచాల సహకార సంఘం డైరెక్టర్ పంది రమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ పాండాల యాద య్యగౌడ్ నుకం శేఖర్ ముదిరాజ్ మహమ్మద్ అష్రఫ్ తదితరులుపాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులు అందజేత

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 03:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి(CMRF) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.శుక్రవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు CMRF మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు.

మహ్మద్ అజారుద్దీన్ – రూ.60,000/–

అనుగుల లావణ్య – రూ. 35000/– బి.సబన్న – రూ. 60,000/–

ఆడారి లక్ష్మి – రూ. 25,000/– ఎన్. విజయలక్ష్మి – రూ. 60,000/–

ఎన్.విజయలక్ష్మి – రూ. 15,000/– నార్లకంటి తులసి రాణి – రూ. 31,000/– ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్

**సికింద్రాబాద్ వెలుతురు జులై 03:**



సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని వెస్ట్ మారేడ్‌పల్లి సుమన్ కాలనీలో ఉన్న పోలింగ్ స్టేషన్ నం. 81 వద్ద జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత ఈఆర్‌వోతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన స్థానిక ఓటర్లతో మాట్లాడి, వారి సందేహాలను నివృత్తి చేశారు.ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియను సమీక్షించిన జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. కేటాయించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఓటర్లకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వో పర్యవేక్షక అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలను ఆదేశించారు.

## కుమ్మరి శంకర్‌ను పరామర్శించిన సిపిఐ(ఎం) నాయకులు

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 03:**



ఎల్లారెడ్డిగూడెం మాజీ ఎంపీటీసీ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ ఇటీవల గొంతు శస్త్రచికిత్స చేయించుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సిపిఐ(ఎం) నాయకులు ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుమ్మరి శంకర్ త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా ఉద్యమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, మండల కమిటీ సభ్యులు దండు రవి, ఆమనగంటి ఐలయ్య, రైతు సంఘం నాయకులు దండు శంకరయ్య, ఆల్లె పరమేష్, పెంజర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి బిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం

**మునుగోడు,జూలై 3(వెలుతురు):**



మండల పరిధిలోని కోతులారం గ్రామానికి చెందిన ఏర్పుల అన్నయ్య–జయమ్మ దంపతుల కుమార్తె మానస వివాహానికి ఈ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ ఈ ఎల్ వి భాస్కర్ ఆర్థిక సహాయం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ జాజుల పారిజాత–సత్యనారాయణ ఆధ్వర్యంలో భాస్కర్‌ను సంప్రదించగా వివాహానికి రూ.30 వేల నగదు,ఒక పట్టు చీర, 100 కిలోల బియ్యాన్ని అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు.ఈ సందర్భంగా మానస తల్లిదండ్రులు ఈ ఎల్ వి భాస్కర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆడపిల్ల వివాహానికి చేయూతనందించి పేద కుటుంబానికి భరోసాగా నిలిచిన భాస్కర్‌ను గ్రామస్థులు అభినందించారు.ఇప్పటికే మునుగోడు నియోజకవర్గంలో విద్య, వైద్యం,సామాజిక సేవ, అత్యవసర ఆర్థిక సాయం వంటి పలు సేవా కార్యక్రమాలను ఈ ఎల్ వి భాస్కర్ నిరంతరం చేపడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి: అదనపు కలెక్టర్ హరిసింగ్

**మోత్కూర్, జూలై 3, వెలుతురు న్యూస్ :**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూర్యాపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) హరిసింగ్ ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలోని కొండగడప, పాటిమట్ల గ్రామాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, వాటిని నింపే విధానంపై ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి దరఖాస్తు ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ధ్రువపత్రాలను సమర్పిస్తూ బీఎల్‌వోలకు ప్రజలు సహకరించి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని హరిసింగ్ కోరారు.ఈ పరిశీలనలో తహశీల్దార్ జ్యోతి, ఆర్ఐ సుమన్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.


## ఫ్రైడే–డ్రై డే కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించిన కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న.

**మోత్కూర్, జులై 3,వెలుతురు న్యూస్ :**



వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపించే అవకాశం ఉన్నందున దోమలను నివారించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న తెలిపారు. ఇళ్లలో, ఇంటి పరిసరాల్లో, కూలర్లు, డ్రమ్‌లు, కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు తదితర వాటిలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలందరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించి తమ ఇళ్లు, కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 12 వార్డు కౌన్సిలర్ మెంట రమణ నగేష్, 11వ వార్డ్ ఆఫీసర్ సంధ్యారాణి, 12వ వార్డు ఆఫీసర్ కిరణ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్ కుమార్, NSUI మండల అధ్యక్షుడు నిమ్మల శ్రీను, నాయకులు రాహుల్, బందెల రవి, మున్సిపల్ సిబ్బంది నరేందర్ డిఎల్ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్



**మోత్కూర్, జులై 3,వెలుతురు న్యూస్ :**

మోత్కూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న 4వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మి నర్సింహా రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్లు మేఘారెడ్డి, యాకుబ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పి.రమేష్, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను, కౌన్సిలర్లు శోభ సోమల్లు, నల్ల మధు, ఇతర బి. ఆర్. ఎస్.నాయకులు, వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గంగా దేవమ్మ తల్లి పండుగకు మహోత్సవానికి హాజరైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 03:**



మండలం లక్ష్మాపురం గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ గంగదేవమ్మ తల్లి పండుగ మహోత్సవాలకు హాజరైన ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించారు.

## గ్రామీణ ప్రాంతాల్లోనే వజ్రాల్లాంటి విద్యార్థులు

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు జూలై 03:**








గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే వజ్రా లాంటి విద్యార్థులు ఉంటారని సంస్థాన్ నారాయణపురం సర్పంచి ఉప్పల విజయలక్ష్మి తెలిపారు. రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురంలోని బాలుర బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ సమకూర్చిన రూ.3 లక్షల విలువైన 'స్టూడెంట్స్ కిట్స్', స్పోర్ట్స్ కిట్స్ లను తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పోలీస్ ఎస్ఐ జగన్ ఎంఈఓ శ్రీనివాస్ లతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ, మట్టిలో మాణిక్యాల మరుగున పడిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రిలయబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చినందుకు అభినందించారు. ఎంతో ప్రతిభ, బోధనా అనుభవం ఉన్న ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని విద్యార్థులను సాన పెట్టి విలువైన వజ్రాల తీర్చిదిద్దాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి అపారమైన మేధస్సు ఉంటుందని, దాన్ని ఉపయోగించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. పోలీస్ ఎస్ఐ జగన్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యమని అన్నారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయకూడదని, మంచి కోసం వినియోగించాలని సూచించారు. రిలయబుల్ ట్రస్ట్ సహకారం అభినందనీయం: ఎంఈఓ రిలయబుల్ ట్రస్ట్ అందించిన సహకారం విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని సంస్థాన్ నారాయణపురం ఎంఈఓ జి శ్రీనివాస్ తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గుజ్జ గ్రామాల్లోని జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిలయబుల్ ట్రస్ట్ సమకూర్చిన స్టూడెంట్స్ కిట్స్ ను ఆయన చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్న ప్రోత్సహించ డానికి రిలయబుల్ ట్రస్టు ద్వారా గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందించినందుకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీలు తుపాకుల రవి, సత్యానందములకు కృతజ్ఞతలు తెలిపారు. గుజ్జ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ట్రస్టు ప్రతినిధి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశం నిర్వహించిన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 03:**



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రాష్ట్ర ప్రభుత్వం (ఎఫ్ఆర్బీఎం ) కింద రూ.1,86,087 కోట్ల అప్పు తీసుకువచ్చిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయని, అయితే మంత్రి తనకు రాసిన లేఖలో మాత్రం రూ.1,77,058 కోట్లుగా పేర్కొన్నారని అన్నారు. ఈ రెండు లెక్కల మధ్య ఉన్న దాదాపు రూ.10 వేల కోట్ల వ్యత్యాసంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అలాగే, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం 27 నెలల్లో రూ.3,47,294 కోట్ల అప్పు చేసిందని ప్రకటించారని గుర్తు చేశారు. మరోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు వేరే లెక్కలు చెబుతున్నారని పేర్కొంటూ, ముఖ్యమంత్రి చెప్పింది నిజమా? లేక మంత్రి చెప్పింది నిజమా? అని ప్రశ్నించారు.ఈ అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తాను చేసిన సవాళ్ల నేపథ్యంలో రాజీనామా చేయాల్సింది. ఎవరో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు.అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన ఆరోపణలకు తాము సమాధానం ఇచ్చామని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4 లక్షల కోట్లేనని ఆధారాలతో నిరూపించామని తెలిపారు. అలాగే, కాగ్ నివేదికలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పు రూ.4.15 లక్షల కోట్లుగా నమోదైందని పేర్కొంటూ, తాము చెప్పిన లెక్కలు, కాగ్ నివేదికలోని వివరాలు ఒకే విధంగా ఉన్నాయని అన్నారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తోందని విమర్శించారు.యాదాద్రి ట్రస్ట్ బోర్డ్ లో నల్గొండ జిల్లా లో ఒక్కరికి కూడా స్థానం కల్పించకపోవడం అత్యంత విచారకరమని, ఇది నల్గొండ జిల్లా ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## సిపిఐ(యం) జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చెయ్యండి

- గుండు వెంకటనర్సు
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి.



**మోత్కూర్, జులై 3, వెలుతురు న్యూస్ :**

ఈ నెల 4,5,6, తేదీలలో భువనగిరి పట్టణ కేంద్రంలోని శ్రీసాయి శ్రీనివాస పంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న సిపిఐ(యం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చెయ్యాలని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. శుక్రవారం రోజున మోత్కూర్ మండలం రాగిబావి గ్రామంలో పార్టీ ముఖ్య నాయకులకు ఆహ్వానాలు ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రాజకీయ శిక్షణా తరగతుల ప్రారంభకులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ , వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి వెంకట్ , పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య హాజరవుతున్నారని తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు శాఖ కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, హాజరుగుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో జరిగే జిల్లా వ్యాప్త ప్రజా ఉద్యమాలతో గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా పోరాటాలకు కర్తవ్యయాలను రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి మండల కమిటీ సభ్యులు పానుగుల రమేష్, మెండు శేఖర్ రెడ్డి, అరిగే సాలయ్య, కక్కెరేణి నర్సయ్య, ఎలుగు పర్వతాలు, మల్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 03:**




కామినేని దంత వైద్యశాల, నార్కట్పల్లి వారి సహకారంతో మునిపంపుల భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించిన కామినేని దంత వైద్యశాల వైద్యులు, సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో దంత వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్సలు అందించారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు శిబిరానికి హాజరై దంత పరీక్షలు చేయించుకుని వైద్య సేవలను పొందారు.ఈ కార్యక్రమంలో కామినేని దంత వైద్యశాల పిఆర్ఓ చంద్రశేఖర్, డా.శృతి,డా.రామాసాయి చరణ్, డా.మణికంఠ, డా. హసీత రాజ్, డా.దూబే దీప్తి, డా.అమూల్య రెడ్డి, భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు తాళ్లపల్లి జితేందర్, గంటెపాక శివ కుమార్, బూడిద బిక్షం, ఉంద్రాతి నర్సింహా,జంపాల ఉమాపతి, హేమలత, సంధ్య, ఉమ, గ్రామ ప్రముఖులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ కలెక్టర్ కృతిక

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 03:**



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని యాదాద్రి భువనగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కృతిక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. అభా హాజరులో అందరూ తమ హాజరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆమె వైద్యులను సిబ్బందిని కోరారు. అనంతరం వార్డులలో ఓపి విభాగంలో తిరిగి రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి భవనం శిథిల దశకు చేరుకుందని వర్షం వస్తే రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని పెచ్చులు ఊడి మీద పడుతున్నాయని జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని, నూతన భవనం ను ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమెను కోరారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట వైద్యులు అలివేలు, శ్వేత ప్రియాంక, స్వాతి బాయి, నవీన్ సింగ్, మాధవాచారి, సపోర్టింగ్ ఇంజనీర్ శోభన, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ రద్దు చెయ్యాలి

- పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చెయ్యాలి
- దడిపల్లి ప్రభాకర్
- రైతు సంఘం మండల కార్యదర్శి.

**మోత్కూర్, జులై 3, వెలుతురు న్యూస్ :**

అన్ లైన్ తో సంబంధం లేకుండా సాగుచేస్తూ భూమి కలిగిన ప్రతి రైతుకు పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చెయ్యాలని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా యాప్ ను తక్షణమే రద్దు చెయ్యాలని, రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరా కోసం ప్రవేశపెట్టిన కొత్త యాప్ కారణంగా సాగుభూమి ఉండి కూడ పట్టాదారు పాసు పుస్తకాలు లేని అనేక మంది రైతులు యూరియా పొందలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు నార్లు పోసి, నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న రైతాంగంలో నేటికీ చాలమందికి స్మార్ట్ ఫోన్లు లేవని, అదిగాక గ్రామాలలో సిగ్నల్స్ ఉండకపోవడం, ఉన్నా యాప్ ను ఉపయోగించి యూరియా బుక్ చేసుకోవడం ఇబ్బందిగా మారిందని అన్నారు. యాప్ ల పేరుతో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, పాత పద్ధతిలోనే రైతాంగానికి యూరియా సరఫరా చెయ్యాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సబ్సిడీ పై అందించాలని కోరారు.



# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

- **కుమారుని వివాహానికి ఆహ్వానం...**

**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**



సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తన కుమారుని వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. గిరిధర్‌రెడ్డి ఆహ్వానాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి వివాహ వేడుక విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తిమ్మాపూర్ బీజేపీ నేతలు




**తిమ్మాపూర్, వెలుతురు జూలై 3:**

తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీ (మహాత్మానగర్)లోని మహిళా శిశు వికాస కేంద్రంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం పర్యటించారు. లోగోడ సి ఎస్ ఆర్ నిధులతో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలను అందించిన సందర్భంగా మహిళా వికాస కేంద్రం యంత్రాంగం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన ఉచిత కుట్టు మిషన్లను శుక్రవారం రోజున మహిళ లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమం సందర్భంగా తిమ్మాపూర్ మండల బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, బూట్ల శ్రీనివాస్, మవురుపు సంపత్, కొయ్యడ శ్రీనివాస్, ఎర్రోజు లక్ష్మణాచారి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఓదెలు, దురిశెట్టి రమేష్, సుగుణాకర్, భూమ్ రెడ్డి, బీజేవైఎం నాయకులు దురిశెట్టి అజయ్, ప్రేమ్ చంద్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ చేనేత సహకార సంఘంపై బీజేపీ జెండా

- **ఏకగ్రీవ అధ్యక్షుడిగా అర్జున్ బండారి ఎన్నిక....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 03:**



తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా భారతీయ జనతా పార్టీ మద్దతుతో పోటీ చేసిన అర్జున్ బండారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ హర్షం వ్యక్తం చేస్తూ, అర్జున్ బండారి ఎన్నిక జహీరాబాద్ పట్టణంలో బీజేపీకి మరో ప్రతిష్ఠాత్మక విజయమని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు సుదీర్ బండారి తండ్రి అయిన అర్జున్ బండారి ఎన్నిక చేనేత కార్మికుల విశ్వాసానికి, భారతీయ జనతా పార్టీపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు.చేనేత సహకార సంఘం అభివృద్ధితో పాటు చేనేత కార్మికుల సంక్షేమానికి అర్జున్ బండారి అంకితభావంతో కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ విజయానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మికులు, సహకార సంఘ సభ్యులు, మద్దతుదారులందరికీ పూల సంతోష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఓటరు జాబితా సవరణపై అపోహలు వీడాలి

- **అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు...**
- **36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 03:**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ సూచించారు. వార్డులో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన ఆయన, పలువురు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో సహకరించారు. ఎస్ఐఆర్ ఉద్దేశం, విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్... ఎస్ఐఆర్ ప్రక్రియలో కేవలం మరణించినవారి పేర్లు, అనర్హులైన ఓటర్ల పేర్లను మాత్రమే జాబితా నుంచి తొలగిస్తారని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా సందేహాలు ఉంటే తనను లేదా సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. అలాగే శాంతినగర్ నుంచి ఇతర ప్రాంతాలకు నివాసం మార్చుకున్న స్థానిక ఓటర్ల సమస్యలను అధికారుల సహకారంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# మధ్యాహ్న భోజనం వద్దు పెండింగ్ డిఎ లు ఇచ్చి, పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలి : తపస్

**మెదక్ వెలుతురు జూలై 3:**



రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో విద్యాసంస్థల లో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు నిర్ణయించడం సరికాదు అని తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు జిడ్డి ఎల్లం జాల సిద్దు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ అన్నారు. ఎవరు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించమని కోరలేదని . మధ్యాహ్న భోజన ధరలు నేటి ధరలకు అనుగుణంగా పెంచకుండా, పాఠశాలలకు మౌళిక సదుపాయాల కల్పించకుండా, పెండింగ్ లో ఉన్న ఆరు డిఏలు, మూడు సంవత్సరాల క్రితం అమలు చేయవలసిన పిఆర్సి నీ అమలు చేయకుండా, ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు మధ్యాహ్న భోజనం వంటి అనాలోచిత నిర్ణయాలు మానుకోవాలని వారు అన్నారు.ఈ కార్యక్రమం లో తపస్ రాష్ట్ర బాద్యులు మన్నే వెంకట్ స్వామి,జిల్లా కోశాధికారి మంగ నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, చేగుంట, కౌడిపల్లి మండలాల అధ్యక్షులు రావుల వెంకటేష్, దాసు ప్రభాకర్,చంద్ర శేఖర్, కిషన్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ ఆర్టీసీ బస్సు డిపో ప్రాంతంలో డ్రైన్ల పూడికతీత పనుల పరిశీలన

**జహీరాబాద్ వెలుతురు జూలై 03:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్టీసీబస్సు డిపో పరిసర ప్రాంతంలో చేపడుతున్న డ్రైన్ల పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్, డిపో మేనేజర్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు.పూడికతీత పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైన్లలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా బస్‌స్టాప్ పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగ్గా నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ జి. ప్రభాకర్ సూచించారు.

# రాష్ట్రంలో అందుబాటులోకి రానున్న మరో

మొదటి పేజీ తరువాయి)



ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో గోద్రెజ్ కంపెనీ నిర్మిస్తున్న ఆయిల్ పామ్ కర్మాగారం పనులు ప్రస్తుతం తుదిదశలో ఉన్నాయని, త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉన్నందున, అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు.సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అంజనాపురం ఆయిల్ పామ్ మిల్లు నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కర్మాగారం నిర్మాణంతో పాటు ఆయిల్ పామ్ విత్తన క్షేత్రం (సీడ్ గార్డెన్), నర్సరీ, పరిశోధన కేంద్రం ఏర్పాటు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సీడ్ గార్డెన్‌లో అధిక నూనె దిగుబడి ఇచ్చే, పొట్టి రకాల ఉత్తమ ఆయిల్ పామ్ మొక్కలను అభివృద్ధి చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు.ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఈ కర్మాగారాన్ని సుమారు రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారని తెలిపారు. గంటకు 15 టన్నుల ఆయిల్ పామ్ గెలలను క్రష్ చేసే సామర్థ్యంతో ఈ కర్మాగారం ఏర్పాటు అవుతోందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా 150 మందికి ప్రత్యక్షంగా, 700 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఆయిల్ పామ్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత కలిగిన గోద్రెజ్ కంపెనీ రాష్ట్రంలో కర్మాగార ఏర్పాటుకు ముందుకు రావడం శుభసూచకమని, అందుకోసమే దేశంలోనే తొలిసారిగా ఆయిల్ పామ్ కర్మాగారంతో పాటు సీడ్ గార్డెన్, R&D, రిఫైనరీ ఏర్పాటు కోసం ఆ కంపెనీకి ప్రభుత్వం భూమిని కేటాయించిందని మంత్రి తెలిపారు. గోద్రెజ్ సంస్థ ఇప్పటికే వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, వంటనూనెలు, సబ్బులు, ఆహార ఉత్పత్తుల తయారీలో ప్రముఖ స్థానంలో ఉందని, పామాయిల్‌ను తమ ఉత్పత్తులకు ముడిసరుకుగా వినియోగించే సామర్థ్యం ఉన్నందునే ఈ అవకాశాన్ని కల్పించినట్లు వివరించారు.అయితే, రైతులకు గెలల ధరను నిర్ణయించే OER పై ప్రైవేట్ కంపెనీలన్ని కోర్టుకు వెళ్లడం మంచిది కాదని, రైతులకు ఇబ్బందులు కలిగించే చర్యలు మానుకోవాలని సూచించారు. ఆయిల్ ఫెడ్ వారిచే నడుపబడుతున్న మిల్లులలో ఏ మిల్లులలో అయితే ఎక్కువ OER వస్తుందో దానిని గెలల ధరను నిర్ణయించడానికి ప్రామాణికంగా తీసుకుంటున్నాము. కాని ప్రైవేట్ కంపెనీలు అన్ని మిల్లుల సరాసరి OER ని ప్రామాణికంగా తీసుకోవాలని కోర్టుకు వెళ్లడం వలన రైతులకు గెలల ధర తక్కువయ్యే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.ప్రైవేట్ కంపెనీల కోసం మిల్లుల ఏర్పాటుకు ఒకపక్క ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తూ, ఆయిల్ పామ్ సాగుకు ముందుకొచ్చే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తూ, రైతుల పురోగతితో పాటు పరోక్షంగా కంపెనీల పురోగతికి కూడా దోహదపడుతుంటే.. రైతుల ఆదాయానికి గండికొట్టే విధంగా ప్రైవేట్ కంపెనీలు చేసే ఆలోచనలు మానుకోవాలని మంత్రి సూచించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరిస్తే.. మా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అయినా వెనుకడుగు వేయదని, రైతుల శ్రేయస్సే మా ప్రభుత్వం మొదటి లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అప్పారావుపేట, అశ్వరావుపేటలలో ఆయిల్ పామ్ కర్మాగారాలు రైతులకు సేవలందిస్తున్నాయని, అలాగే ఇటీవల మార్చి నెలలో గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో మరో ఆధునిక ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అంజనాపురం కర్మాగారంతో పాటు రాష్ట్రంలో మరో ఐదు ఆయిల్ పామ్ కర్మాగారాల నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం 81,263 మంది రైతులు సుమారు 2.97 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. కొత్త కర్మాగారాలు అందుబాటులోకి రావడం ద్వారా మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కనీసం ఒక ఆయిల్ పామ్ కర్మాగారం ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం, చీడపీడల బెడద తక్కువగా ఉండటం, తక్కువ నిర్వహణ వ్యయంతో దీర్ఘకాలిక స్థిరమైన ఆదాయం లభించడం వంటి కారణాలతో ఆయిల్ పామ్ రైతులకు సిరుల పంటగా మారిందన్నారు. గత ఆరేళ్లలో రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు గణనీయంగా విస్తరించిందని, ఒకప్పుడు ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఈ పంటను ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని జిల్లాలకు విస్తరించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే కొత్త కర్మాగారాల ఏర్పాటు, ప్రాసెసింగ్ సదుపాయాల కల్పనతో పాటు రైతులకు ఎకరానికి రూ.46,250 సబ్సిడీ కూడా అందిస్తున్నట్లు తెలిపారు.ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు నేటి పరిస్థితుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే ఎక్కువ ఆదాయం పొందుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు నెలకు ఒకసారి వేతనం వస్తే, ఆయిల్ పామ్ రైతులకు ప్రతి 20 రోజులకు ఒకసారి ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.23,852గా ఉందని, ఇది పామాయిల్ చరిత్రలోనే అత్యధిక ధర అని చెప్పారు. అంతేకాకుండా ఆయిల్ పామ్ తోటల్లో అంతరపంటలు సాగు చేసి రైతులు అదనపు ఆదాయం కూడా పొందే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సైతం తట్టుకుని రైతులకు నిరంతరంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే అత్యుత్తమ పంట ఆయిల్ పామ్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# చంద్రపురి కాలనీలో నూతన రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 03:**



కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 2వ డివిజన్ చంద్రపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ చౌకధరల రేషన్ దుకాణాన్ని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సులభంగా అందేలా నగరంలో అవసరమైన ప్రాంతాల్లో ప్రజా సౌకర్యాలను విస్తరిస్తున్నామని తెలిపారు. కొత్త రేషన్ దుకాణం ఏర్పాటు వల్ల చంద్రపురి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన ప్రజా పంపిణీ సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు సంక్షేమ సేవలను కూడా మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.నగర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు, సంబంధిత శాఖ అధికారులు మరియు ప్రజా పంపిణీ వ్యవస్థ సిబ్బంది పాల్గొన్నారు. కొత్త రేషన్ దుకాణం ప్రారంభం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యాసేవకు గౌరవ వందనం.. ప్రదీప్ కుమార్‌కు ఘన సత్కారం

- **ఉపాధ్యాయుల హక్కులు వెంటనే అమలు చేయాలి: పీఆర్టీయూ టీఎస్**

**జహీరాబాద్ వెలుతురు జూలై 03:**

ఎంపీపీఎస్ ఆల్గోల్ ప్రధానోపాధ్యాయులు, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. ప్రదీప్ కుమార్ 41 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ సేవలను పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యూనియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల మణయ్య, డా. తులసిరామ్ రాథోడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం నాలుగు దశాబ్దాల పాటు సేవలందించిన ప్రదీప్ కుమార్‌ను అభినందించారు. సమాజంలో చేసిన సేవలే శాశ్వత గుర్తింపును తీసుకొస్తాయని పేర్కొన్నారు. త్వరలో ఉపాధ్యాయులకు నూతన హెల్త్ కార్డులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభు, జిల్లా గౌరవ అధ్యక్షులు డా. తులసిరామ్ రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాలయ్య, విట్టల్, నర్సయ్య, అమర్‌నాథ్ రెడ్డి, రమేశ్ బానోత్, మొగులయ్య, సతీష్ గౌడ్, వెంకటేశం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు రాజేశ్వరి, జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు బాగయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, జహీరాబాద్ టౌన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారాం చవ్వాణ్, మొగుడంపల్లి అధ్యక్షులు అర్జున్ చవ్వాణ్, న్యాల్కల్ అధ్యక్షులు మురళీధర్, కోహీర్ అధ్యక్షులు తిరుమలేష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.









# దిడిగి గ్రామంలో రూ. 5 లక్షల నరేగా నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

- **సంక్షేమం మరియు అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం....**
- **జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పట్లోళ్ల నర్సింహారెడ్డి...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 03:**





గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమం మరియు అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పట్లోళ్ల నర్సింహారెడ్డి తెలిపారు.శుక్రవారం జహీరాబాద్ మండలంలోని దిడిగి గ్రామంలో గ్రామ సర్పంచ్ జగదాంబ సోమప్పతో కలిసి రూ.5 లక్షల నరేగా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నర్సింహారెడ్డి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను సర్పంచ్ ప్రతినిధి సోమప్ప పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగదాంబ సోమప్ప, సీడీసీ డైరెక్టర్ మల్లారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ షేక్ ఇమాం పటేల్, ఉప సర్పంచ్ సోమయిల సురేష్, సీనియర్ నాయకులు మున్నూర్ నర్సింలు, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయంలోకి అనుమతికి క్యూఆర్ కోడ్ పెట్టడం దుర్మార్గం

- ఇది ప్రజాపాలన కాదు నియంత పాలన.
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలోకి ప్రవేశం కల్పించడానికి క్యూఆర్ కోడ్ పెట్టడం చాలా దుర్మార్గమైన విషయమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆ యొక్క క్యూఆర్ కోడ్ కేవలం ఒక గంట మాత్రమే అందులో ఉండడానికి అవకాశం కల్పించడం అంటే ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది సచివాలయంలో పని మీద వస్తారని ఆ సమయంలో వీళ్లు కలవాల్సిన అధికారులు వేరే సమావేశంలో ఉంటే వందల కిలోమీటర్ల నుంచి వచ్చిన వారి పరిస్థితి ఏంటని లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన కాదు నియంత పాలన అని ధ్వజమెత్తారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని అన్నారు.

# వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

- నాణ్యమైన ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికి అందించాలి
- గర్భిణీ స్త్రీల పరీక్షలు, సేవలు , వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థ వంతంగా నిర్వహించాలీ.
- మురికివాడాలలో (స్లమ్స్)లో నివసిస్తున్న పేద ప్రజలకు క్రమం తప్పకుండా ఆరోగ్య సేవలు అందించాలి.
- సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి
- డా: పుట్ల శ్రీనివాస్
- జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్.

**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**





సూరజ్ భాను క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దవాఖాన, ఆర్ బి ఎస్ కే చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం శుక్రవారం రోజున ఏశ్ర హాస్పిటల్ చార్మినారూ సమావేశ మందిరంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా DM&HO గారు మాట్లాడుతూ, వివిధ జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారిగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల అమలులో వేగం పెంచి సత్వరమే పూర్తి చేయాలని కోరారు.

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థ వంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ,సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డా: శ్రీధర్ , వ్యాధి నిరొదక టీకాల అధికారి , అదనపు జిల్లా వైద్యాధికారి డా:అనిత , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా: సాయిబాబా, డా : శ్రీ కల,డా: ఆశ్రిత రెడ్డి ,డా: శ్రీధర్,సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ , శ్రీనివాస్ డిప్యూటీ డెమో ,సంతోష్ డిపీఓ,పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు , దిశా నిర్దేశం చేశారు.

# హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీజీవో రాష్ట్ర నాయకులు



**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**

హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్‌తో పాటు కృష్ణ యాదవ్, ఎం.ఏ. ఖాదర్, డాక్టర్ రామారావు, డాక్టర్ శ్రీరామరెడ్డి, షౌకత్ హుస్సేన్, పుట్ట శ్రీనివాస్, డాక్టర్ సాయిబాబా, అక్కేశ్వరరావు, డాక్టర్ సురేందర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరస్పర ఆసక్తికర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

# మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పిసిసిఎఫ్ వినయ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**

రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ ఈ రోజు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారిని జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు.అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు. అటవీ శాఖ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, అటవీ సంపదను కాపాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సహాకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకుగాను పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మంత్రి సురేఖ గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, అటవీ సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు.



మంత్రి కొండా సురేఖ

మాజీ పిసిసిఎఫ్ ను సత్కరించి, అభినందలను తెలిపిన పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ శ్రీమతి సువర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి, అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీవిరమానంతర జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# డీజీపీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సైబరాబాద్ పోలీసు అధికారులు





- డ్రగ్స్ నిర్మూలనలో సైబరాబాద్ పోలీసుల పనితీరుకు డీజీపీ ప్రశంసలు

**సైబరాబాద్, వెలుతురు జూలై 3:**

రాష్ట్రంలోని అన్ని యూనిట్ల అధికారులు, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో రాష్ట్ర డీజీపీ సి వి ఆనంద్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శాంతిభద్రతలు, నేర నియంత్రణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజలకు చేరువైన పోలీసింగ్‌పై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రమేష్ రెడ్డి సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

అదేవిధంగా CCTNS, ఈ–సాక్ష్య (e–Sakshya) వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను పూర్తి స్థాయిలో అమలు చేసి, ప్రతి కేసులో డిజిటల్ ఆధారాలను సమర్థవంతంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.డియో కాన్ఫరెన్స్ సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ కమిషనరేట్ పరిధిలో అమలు చేస్తున్న ప్రత్యేక చర్యలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్లు, నేర నియంత్రణ చర్యలు, విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలపై వివరించారు. డ్రగ్స్ నిర్మూలనలో సైబరాబాద్ పోలీసులు సాధిస్తున్న ఫలితాలను డీజీపీ అభినందించారు.ఈ సమావేశంలో కమిషనర్‌తో పాటు కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అయోధ్య విరాళాల కేసులో కీలక మలుపు..

**అయోధ్య వెలుతురు జూలై 03:**



అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసు దర్యాప్తులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక నిర్ణయం తీసుకుంది. ట్రస్ట్‌కు సంబంధించిన గత ఐదేళ్ల ఆర్థిక లావాదేవీలను రీఆడిట్ చేయాలని నిర్ణయించింది. ప్రాథమిక విచారణలో భారీ అవకతవకలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆలయ నిర్మాణ వ్యయాలు, నగలు, బంగారం, వెండి వస్తువులు, విరాళాలకు సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించనుంది.ఈ కేసులో విరాళాల లెక్కింపు పనిలో పాల్గొన్న ప్రధాన నిందితుడు అవినాష్ శుక్లాను అయోధ్య పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.

ఆయన వద్ద భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.ఇప్పటికే ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన గోపాల్‌రావ్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. చంపత్‌రాయ్, అనిల్ మిశ్రాలు ఇటీవల తమ పదవులకు రాజీనామాలు ప్రకటించగా, వాటిని ఆమోదించాలా లేదా అనే అంశంపై జులై 6న జరిగే ట్రస్ట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.విరాళాల వినియోగం, ట్రస్ట్ ఆర్థిక నిర్వహణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ దర్యాప్తు దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సిట్ దర్యాప్తులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# అంబర్‌పేట్ లో ఎస్ఐఆర్‌లో ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ సహాయ కేంద్రం

**బషీర్ బాగ్ వెలుతురు జూలై 3:**



ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని బాపూనగర్‌లో బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయ కేంద్రం ను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని పప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపడంపై అవగాహన కల్పించారు. ఫారాలు నింపే విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వాటిని ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారులు (బి యల్ ఓ లు), బూత్ లెవల్ ఏజెంట్లు (బి యల్ ఎలు ) సమన్వయంతో ప్రజలకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేశారని తెలిపారు. అయితే ఫారాలను పూర్తి వివరాలతో, ఎలాంటి తప్పులు లేకుండా పూరించకపోతే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అందువల్ల ప్రతి ఓటరు ఈ ప్రక్రియను ఎంతో బాధ్యతతో తీసుకోవాలని, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని తమ ఎన్యూమరేషన్ ఫారాలను సరైన విధంగా పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు నిర్ణీత గడువులోగా అందజేయాలని ప్రజలకు సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో కొనసాగేందుకు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాలేరు మణికాంత్, సింగజోగి శ్రీనివాస్, కే. సింహాచలం, బందారం అనిల్ గౌడ్, నరసింహ చారి (చిమ్మి), మొహమ్మద్ అమీర్, మహమ్మద్ ఫెరోజ్, వెంకటేష్, రాహుల్ ముదిరాజ్, అక్షయ్ కుమార్, మొహమ్మద్ ఇబ్రహీం, ఇమ్రాన్, హరీష్, అఖిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తో బహిరంగ చర్చకు...

(మొదటి పేజీ తరువాయి)



అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర అప్పుల అంశాలపై ఇప్పటికైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ చర్చకు ఎవరొచ్చినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.అయితే చర్చ పేరుతో బీఆర్ఎస్ నేతలు భారీగా మంది మార్బలంతో, ఆర్భాటంగా వచ్చి ప్రదర్శనలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో తీసుకున్న అప్పులకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని దాచిపెట్టే అవకాశం లేదని పేర్కొన్నారు.వాస్తవాలను ప్రజల ముందు ఉంచితే వాటిని అంగీకరించకుండా రాద్ధాంతం చేయడం తగదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలకు నిజాలు తెలియాలంటే వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

# రూ.2 వేల కోట్ల స్కాం ఎలా...



(మొదటి పేజీ తరువాయి)

హరీశ్‌రావు ఫోన్ ఎత్తలేదని చెబుతున్నారని, అయితే తమ వైపు నుంచి చేసిన ఫోన్ కాల్స్‌కు కూడా స్పందించలేదని అన్నారు. రాహుల్ ఫోన్ చేసినప్పుడు ఆయన లిఫ్ట్ చేశారా అని ప్రశ్నించారు. పోలీసులతో అరెస్టులు చేయించేంత పిరికివాళ్లు తాము కాదని, తమకు ప్రజల్లో విశ్వసనీయత ఉందని పేర్కొన్నారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై వ్యతిరేకించామని, అదే ప్రజాస్వామ్య విధానమని చెప్పారు. తాను, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కింది స్థాయి నుంచి ఎదిగిన నాయకులమని, అది హరీశ్‌రావుకు తెలియదా అని ప్రశ్నించారు. పదేళ్లుగా లబ్ధి పొందిన కొందరు చెప్పిన మాటలు విని నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు.గురుకులాలకు సంబంధించిన టెండర్లపై వస్తున్న ఆరోపణలను ఖండించిన పొన్నం ప్రభాకర్.. మొత్తం టెండర్ల విలువ రూ.1,142 కోట్లు మాత్రమేనని, అలాంటప్పుడు రూ.2 వేల కోట్ల స్కాం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ప్రతి టెండర్‌కు సంబంధించిన పత్రాలు ప్రభుత్వ వద్ద ఉన్నాయని, అవసరమైతే వాటిని చూపిస్తామని స్పష్టం చేశారు. గురుకుల విద్యను మరింత మెరుగుపర్చే లక్ష్యంతోనే వ్యవస్థను కేంద్రీకరించే చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు.

# హనీమూన్ హత్య కేసులో సుప్రీం కీలక నిర్ణయం

- సోనమ్ రఘువంశీ బెయిల్‌పై స్టేకు నిరాకరణ
- విడుదలైనందున జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- కోర్టులో సొలిసిటర్ జనరల్ తుషార్ కీలక వాదనలు
- సాంకేతిక కారణాలతో బెయిల్ ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం
- విగ్గు పెట్టుకున్నాడని కాబోయే భర్తను చంపిన కేసు ప్రస్తావన
- పెరుగుతున్న దారుణాలపై ఎస్‌జీ ఆందోళన
- పోలీసుల తప్పిదాల వల్లే లభించిన ఊరట
- అరెస్ట్ మెమోలో లోపాలను గుర్తించిన షిల్లాంగ్ కోర్టు

**ఢిల్లీ వెలుతురు జూలై 03:**

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలిగా ఉన్న సోనమ్ రఘువంశీకి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఆమెకు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై తక్షణమే స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. నిందితురాలు సోనమ్ ఇప్పటికే జైలు నుంచి విడుదలయిందని, అంతేకాకుండా కోర్టు విధించిన అన్ని రకాల షరతులను ఆమె నిశితంగా పాటిస్తున్నందున, ప్రస్తుత తరుణంలో ఆమె బెయిల్‌ను రద్దు చేయాల్సిన అత్యవసర అవసరం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది.ఈ కేసు విచారణ సందర్భంగా మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేశ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో అత్యంత కీలకమైన వాదనలు వినిపించారు. సోనమ్ రఘువంశీపై మోపబడిన హత్య ఆరోపణలు చాలా గంభీరమైనవని, సమాజంపై తీవ్ర ప్రభావం చూపే ఇలాంటి కేసుల్లో కేవలం సాంకేతిక లోపాలను సాకుగా చూపి నిందితులకు బెయిల్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఆదేశాల వల్ల విచారణ దెబ్బతినే ప్రమాదం ఉందని, అందుకే ఆమెను వెంటనే మళ్లీ జైలుకు పంపేలా స్టే ఇవ్వాలని గట్టిగా కోరారు.వాదనల సమయంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాజంలో పెరిగిపోతున్న క్రూరత్వాన్ని ప్రస్తావిస్తూ ఇటీవల వెలుగులోకి వచ్చిన 'సియా కేతన్' కేసును ఉదాహరణగా చెప్పారు. కేవలం తలపై విగ్గు పెట్టుకున్నాడనే ఒక చిన్న కారణంతో ఒక యువతి తాను పెళ్లి చేసుకోబోయే కాబోయే భర్తను అతి దారుణంగా చంపేసిన ఉదంతాన్ని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలాంటి కేసుల తర్వాత సమాజంలో భార్యాభర్తల బంధాల మధ్య ఇటువంటి ఘోరాలు మరింతగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత సుప్రీంకోర్టు కూడా బెయిల్ రద్దుకే మొగ్గు చూపినప్పటికీ, ఆమె ఇప్పటికే జైలు





బయట ఉన్నందున కఠినంగా వ్యవహరించడం లేదని వ్యాఖ్యానించింది.గతంలో ఏప్రిల్ నెలలో మేఘాలయలోని షిల్లాంగ్ కోర్టు సోనమ్‌కు మొదటిసారి బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈ బెయిల్ రావడం వెనుక పోలీసులు చేసిన ఒక పెద్ద తప్పిదం ఉందనే వార్తలు అప్పట్లో గుప్పుమన్నాయి. కేసు నమోదు చేసే సమయంలో చట్టపరమైన సెక్షన్ల విషయంలో, అలాగే అరెస్ట్ మెమోతో పాటు కేసుకు సంబంధించిన దర్యాప్తు పత్రాల్లో పోలీసులు తీవ్రమైన లోపాలకు తావిచ్చారని షిల్లాంగ్ కోర్టు గుర్తించింది. పోలీసులు దీనిని కేవలం సాంకేతిక పొరపాటుగా వాదించినప్పటికీ, కోర్టు ఆ వాదనను తిరస్కరిస్తూ.. సోనమ్ అరెస్టుకు చూపిన కారణాలు చట్టబద్ధంగా సరైనవిగా లేవని పేర్కొంటూ ఆమెకు బెయిల్ ఇచ్చింది.ఈ దారుణ హత్య ఉదంతం గత ఏడాది చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరానికి చెందిన రాజా రఘువంశీ కుటుంబానికి పెద్ద ఎత్తున ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం ఉంది. గత ఏడాది మే 11న రాజా రఘువంశీకి, సోనమ్‌తో ఎంతో వైభవంగా వివాహం జరిగింది. పెళ్లయిన కొన్ని రోజులకే, అనగా మే 20వ తేదీన ఈ కొత్త జంట హనీమూన్ పర్యటన కోసం ఎంతో సంతోషంగా మేఘాలయ రాష్ట్రానికి వెళ్లారు. అయితే అక్కడికి వెళ్లిన కొద్ది రోజులకే ఇద్దరూ కనిపించకుండా పోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు గాలించగా.. సుమారు 11 రోజుల తర్వాత సోహ్రా ప్రాంతంలోని ఒక జలపాతం సమీపంలో ఉన్న లోతైన లోయలో రాజా రఘువంశీ మృతదేహం కత్తిగాట్లతో దారుణమైన స్థితిలో లభ్యమైంది.భర్త శవం దొరికిన సమయంలో భార్య సోనమ్ అక్కడ కనిపించకపోవడంతో పోలీసులకు ఆమెపైనే మొదటి అనుమానం వచ్చింది. ఆమె కోసం దేశవ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టగా, జూన్ 7వ తేదీన సోనమ్ హఠాత్తుగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గాజీపూర్ ప్రాంతంలో ప్రత్యక్షమైంది. తక్షణమే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అసలు నిజం బయటపడింది. పెళ్లికి ముందే ఉన్న తన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో కలిసి, పక్కా ప్లాన్ ప్రకారమే హనీమూన్ నెపంతో భర్తను మేఘాలయకు పిలుచుకొచ్చి అక్కడ హత మార్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో పోలీసులు సోనమ్‌తో పాటు ఆమె ప్రియుడు రాజ్ కుశ్వాహా, వారికి సహకరించిన మరో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు.షిల్లాంగ్ కోర్టు సోనమ్‌కు బెయిల్ ఇచ్చే సమయంలో రూ.50,000 విలువైన వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని ఆదేశించింది. దాంతో పాటు అనేక కఠినమైన షరతులను కూడా విధించింది. బెయిల్ కాలంలో ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ షిల్లాంగ్ కోర్టు అధికార పరిధిని దాటి ఇతర ప్రాంతాలకు లేదా రాష్ట్రాలకు వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే, ముందే కోర్టుకు రాతపూర్వకంగా తెలియజేసి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొంది. అలాగే, ఈ కేసులోని సాక్షులను బెదిరించడానికి లేదా ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే బెయిల్ తక్షణమే రద్దవుతుందని హెచ్చరించింది.భర్తను హనీమూన్‌లో ప్రియుడితో కలిసి చంపిన విషయం బయటకు రాగానే సోనమ్ రఘువంశీ సొంత కుటుంబ సభ్యులు కూడా ఆమెను అసహ్యించుకున్నారు. తాము ఆమెతో ఉన్న అన్ని రకాల రక్తసంబంధాలు, కుటుంబ బంధాలను పూర్తిగా తెంచేసుకుంటున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుడు రాజ్ రఘువంశీ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని సోనమ్ సొంత సోదరుడు మీడియా ముఖంగా వెల్లడించారు. చట్టపరంగా గానీ, వ్యక్తిగతంగా గానీ జైల్లో ఉన్న సోనమ్‌కు తమ కుటుంబం నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందించబోమని ఆయన స్పష్టం చేయడం గమనార్హం.

# తమిళనాడు సీఎంపై వివాదాస్పద వ్యాఖ్యలు

- డీఎంకే ఎమ్మెల్యే అనిత రాధాకృష్ణన్ అరెస్ట్
- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు
- నటి త్రిషతో జోడించిన సంచలన ఆరోపణ
- అగ్రహంతో ఊగిపోయిన సీఎం విజయ్ అభిమానులు
- రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుల పర్వం
- ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు
- శుక్రవారం ఉదయమే పిటిషన్ తిరస్కరణ
- కారులోంచి దించి పోలీస్ జీపులోకి ఎక్కించిన వైనం





**చెన్నై వెలుతురు జూలై 03:**

తమిళ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగుందుతున్న స్టార్ హీరోయిన్ త్రిష పుట్టినరోజు వేడుకల సందర్భంగా అధికార డీఎంకే పార్టీకి చెందిన ఒక సీనియర్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి మహిళా నటిపై ఆయన చేసిన వ్యాఖ్యలు అత్యంత వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యాఖ్యల తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో అటు సినీ రంగానికి చెందిన ప్రముఖులు, ఇటు సాధారణ ప్రజలు సదరు ఎమ్మెల్యే తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.నటి త్రిషపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తమిళ సూపర్ స్టార్, 'తమిళగ వెట్రి కళగం' అధినేత విజయ్ అభిమానులు తీవ్రంగా స్పందించారు. త్రిషతో కలిసి విజయ్ ఎన్నో అద్భుతమైన సినిమాల్లో నటించిన నేపథ్యంలో, ఆమెపై జరిగిన వ్యక్తిగత దాడిని విజయ్ అభిమాన సంఘాలు తీవ్రంగా పరిగణించాయి. ఆ ఆగ్రహంతోనే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న పలు పోలీస్ స్టేషన్లకు వెళ్లి సదరు డీఎంకే నేతపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ భారీగా ఫిర్యాదులు చేశారు. దీంతో పోలీసులు ఈ వ్యవహారాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించి కేసులు నమోదు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా తనపై వరుసగా కేసులు నమోదవుతుండటంతో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి డీఎంకే మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అయిన అనిత ఆర్. రాధాకృష్ణన్ గట్టి ప్రయత్నాలే చేశారు. దీని కోసం ఆయన మద్రాస్ హైకోర్టును ఆశ్రయించి, తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్‌పై శుక్రవారం ఉదయం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. ఎమ్మెల్యే అభ్యర్థనను తోసిపుచ్చింది. సమాజంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్న ఉద్దేశంతో ఆయన బెయిల్ పిటిషన్‌ను కోర్టు పూర్తిగా కొట్టివేసింది.మద్రాస్ హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైనట్లు సమాచారం అందిన వెంటనే తమిళనాడు పోలీస్ యంత్రాంగం అత్యంత వేగంగా అప్రమత్తమైంది. అనిత రాధాకృష్ణన్ ఎక్కడున్నారనే సమాచారాన్ని సేకరించి, రంగంలోకి దిగిన ఉన్నత స్థాయి పోలీసు బృందం ఆయనను పట్టుకునేందుకు వ్యూహం రచించింది. మార్గమధ్యంలో ఆయన ప్రయాణిస్తున్న సొంత విలాసవంతమైన కారును పోలీసులు చుట్టుముట్టారు. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం ఆయనను కారులోంచి కిందకు దించి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేరుగా పోలీస్ అధికారిక వాహనంలోకి ఎక్కించి అరెస్ట్ చేశారు.ఈ నాటకీయ అరెస్ట్ అంతా తూత్తుకుడి జిల్లాలోని ఆత్తూరు టౌన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం అనిత రాధాకృష్ణన్ తన నియోజకవర్గ పరిధిలోని ఆత్తూరు టౌన్ పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాన్ని, ఇతర స్థానిక వికాస, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వెళ్లారు. అక్కడ పనుల తనిఖీ కార్యక్రమాలను ముగించుకుని ఆయన తన అనుచరులతో కలిసి కారులో తిరుగు ప్రయాణమైన సమయంలో, ముందే మాటువేసిన పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం స్థానికంగా కలకలం రేపింది.తమ ప్రియతమ నాయకుడు, ఎమ్మెల్యే అనిత రాధాకృష్ణన్ అరెస్ట్ అయ్యారనే వార్త క్షణాల మీద ఆత్తూరు పరిసర ప్రాంతాల్లో దావానంలా వ్యాపించింది. దీంతో సమీప గ్రామాల్లో ఉన్న డీఎంకే పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు, వందలాది మంది కార్యకర్తలు భారీ సంఖ్యలో ఘటనా స్థలానికి దూసుకొచ్చారు. ఎమ్మెల్యేను తరలిస్తున్న పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి ముందుకు కదలకుండా అడ్డుగా నిలబడ్డారు. డీఎంకే ప్రభుత్వానికి, పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అక్కడి ప్రధాన రహదారిపై బైఠాయించి తీవ్రమైన రోడ్డు దిగ్బంధం (రాస్తారోకో) చేపట్టారు.డీఎంకే కార్యకర్తల హఠాత్ ఆందోళనతో ఆత్తూరు ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర గందరగోళం, అశాంతి నెలకొంది. వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పరిస్థితి చేతులు దాటిపోకుండా చూసేందుకు పోలీసులు నిరసనకారులతో చర్చలు జరిపినప్పటికీ వారు వినలేదు. దీంతో శాంతిభద్రతలను కాపాడటం కోసం పోలీసులు సదరు ఆందోళనకారులను గట్టిగా నెట్టివేస్తూ, లాఠీలతో చెల్లాచెదురు చేశారు. నిరసనకారుల పిడికిలి నుంచి పోలీసు వాహనాన్ని సురక్షితంగా ముందుకు కదిలించి అక్కడి నుండి వేగంగా నిష్క్రమించారు.నిరసనకారుల బారి నుంచి ఎమ్మెల్యేను తరలించిన పోలీసులు, తదుపరి చట్టపరమైన విచారణల నిమిత్తం అనిత రాధాకృష్ణన్‌ను నేరుగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ ఆయనపై నమోదైన కేసుల ఆధారంగా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. కాగా, ఈ అరెస్ట్ వ్యవహారం అధికార పార్టీలో తీవ్ర అసంతృప్తిని రగిల్చిన నేపథ్యంలో, తూత్తుకుడి జిల్లావ్యాప్తంగా ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ లేదా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా చూసేందుకు జిల్లా సరిహద్దుల్లో, ప్రధాన కూడళ్లలో వందలాది మంది అదనపు పోలీసు బలగాలను, పారామిలటరీ సిబ్బందిని భారీగా మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

# పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- నియంత్రణ కోల్పోయి లోయలో పడ్డ బస్సు
- మహిళలు, పిల్లలతో సహా 40 మంది దుర్మరణం
- పర్వత ప్రాంతంలో పల్టీ కొట్టిన బస్సు
- ఘటనా స్థలంలో గుండెలవిసే రోదనలు
- క్వెట్టా నుండి పెషావర్ వెళ్తుండగా ప్రమాదం
- రెండు ప్రావిన్సుల యంత్రాంగం అప్రమత్తం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**పాకిస్థాన్ వెలుతురు జూలై 03:**

పాకిస్థాన్ దేశంలో అత్యంత విషాదకరమైన రోడ్డు ప్రమాదం సంభవించింది. వాయువ్య పాకిస్థాన్ పరిధిలోని పర్వత ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక పెద్ద బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో బస్సు పూర్తిగా నుజ్జునుజ్జవగా, లోపల ఉన్న ప్రయాణికులలో మెజారిటీ ప్రజలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాద వార్త పాకిస్థాన్ అంతటా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.ఈ ఘోర ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య వినేవారిని కలచివేస్తోంది. బస్సు లోయలో పడిన తీవ్రతకు ఇప్పటివరకు ఏకంగా 40 మంది ప్రయాణికులు మరణించినట్లు స్థానిక అధికారిక వర్గాలు ధృవీకరించాయి. మరణించిన వారిలో ఎక్కువ సంఖ్యలో మహిళలు, పసిపిల్లలు ఉండటం పట్ల అధికారులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బాధితుల ఆర్తనాదాలు, గుండెలవిసే రోదనలతో ఆ పర్వత ప్రాంతమంతా నిండిపోయింది.అధికారులు అందించిన వివరాల ప్రకారం, ఈ దురదృష్టకర బస్సు బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా నగరం నుండి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్ వైపు తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అయితే బస్సు ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ పరిధిలోని డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లా పర్వతాల గుండా వెళ్తున్న సమయంలో ఈ ఘోర విపత్తు చోటుచేసుకుంది. సుదీర్ఘ ప్రయాణంలో ఉన్న ఈ బస్సు గమ్యస్థానానికి చేరకముందే మధ్యలోనే అనంత లోకాల్లోకి కలిసిపోయింది.ఈ పర్వత ప్రాంత మార్గంలో అనేక ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. బస్సు వేగంగా వెళ్తున్న సమయంలో ఒక ఘాట్ రోడ్డు మలుపు వద్ద డ్రైవర్ అకస్మాత్తుగా వాహనంపై తన నియంత్రణను కోల్పోయాడు. రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడను బలంగా ఢీకొట్టిన బస్సు, ఆ వేగానికి నేరుగా వందల అడుగుల లోతున్న లోయలోకి దూసుకెళ్లింది. కొండ చరియలను బలంగా ఢీకొంటూ బస్సు కిందకు పడిపోవడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై స్థానిక రవాణా అధికారులు ప్రాథమిక విచారణ జరిపారు. కొండ దిగువకు వస్తున్న సమయంలో బస్సు యొక్క బ్రేకులు పూర్తిగా విఫలమయ్యాయని (బ్రేక్ ఫెయిల్యూర్), దానివల్ల డ్రైవర్ ఎంత ప్రయత్నించినా వాహనాన్ని ఆపలేకపోయాడని అధికారులు తేల్చారు. వేగ నియంత్రణ సాధ్యం కాకపోవడంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగిందని వారు స్పష్టం చేశారు.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో డ్రైవర్, క్లీనర్‌తో కలిపి మొత్తం 48 మంది ప్రయాణికులు ఉన్నట్లు రికార్డుల ద్వారా తెలిసింది. వీరిలో 40 మంది అక్కడికక్కడే చనిపోగా, మరో ఎనిమిది మంది అదృష్టవశాత్తూ తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు లోయలోకి దిగి ఆ ఎనిమిది మందిని సురక్షితంగా వెలికితీసి, తక్షణ అత్యవసర చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం జరిగిన వెంటనే రెండు ప్రావిన్సుల జిల్లా యంత్రాంగాలు, అత్యవసర విపత్తు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. లోయ చాలా లోతుగా ఉండటంతో మృతదేహాలను పైకి తీసుకురావడానికి రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. లోయ నుండి వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, ప్రస్తుతం బాధితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని షెరాని జిల్లా డిప్యూటీ కమిషనర్ వలీ ఖాన్ కాకర్ పాత్రికేయులకు వెల్లడించారు.ఈ ఘోర ప్రమాదంపై బలూచిస్థాన్ ముఖ్యమంత్రి మీడియా ఇన్‌చార్జ్ షాహిద్ రింద్ స్పందించారు. ప్రమాద బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి ఖైబర్ పఖ్తుంఖ్వా మరియు బలూచిస్థాన్ రాష్ట్రాల అధికారులు సంయుక్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నందున వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతదేహాలను వారి స్వగ్రామాలకు చేర్చడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.



# ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా కి ఘన స్వాగతం పలికిన – శ్రీజ్యోతి భీమ్ భరత్



**హైదరాబాద్ వెలుతురు జూలై 03:**

ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా గారు తెలంగాణ లో సంవిధాన్ సభ' ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జాతీయ లీగల్ కాన్క్లేవ్ (Telangana Chapter) కార్యక్రమంలో పాల్గొనడానికి రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా వారికి శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గారు మరియు రంగా రెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ గారు పాల్గొని వారికి ఘన స్వాగతం పలికి , శాలువ తో సత్కరించి పుష్ప గుచ్ఛం తో స్వాగతం పలికారు.. వీరితో పాటుగా జిల్లా , మహిళా కాంగ్రెస్ నాయకురాలు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# తమిళ వెబ్‌సిరీస్‌లో జాన్వీ



భాషలతో సంబంధం లేకుండా అగ్రతారలు, యువ కథానాయకుల సరసన అవకాశాలను అందిపుచ్చుకుంటూ వరుస చిత్రాలతో బిజీగా గడుపుతోంది బాలీవుడ్ హీరోయిన్ జాన్వీకపూర్. ఇటీవలే 'పెద్ది' చిత్రంలో అచ్చియమ్మ పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించింది. తదుపరిగా పలు హిందీ చిత్ర ప్రాజెక్టుల్ని పట్టాలెక్కించిన ఆమె ఇప్పుడు తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దర్శకుడు పా.రంజిత్ రూపొందించనున్న ఓ వెబ్ సిరీస్‌లో జాన్వీ కథానాయికగా నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ వెబ్ సిరీస్‌కి సర్కునం దర్శకత్వం వహించనున్నారట. ఇటీవలే ఆయన అబ్బాస్, దుషారా విజయన్, అదితి బాలన్ ప్రధాన పాత్రల్లో 'ఎగ్జామ్' సిరీస్‌ని తెరకెక్కించారు. గ్రామీణ ప్రేమ కథలతో తనదైన శైలిలో చిత్రాలను తెరపై ఆవిష్కరించే సర్కునం దర్శకత్వంలో.. వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియులకు చేరువైన జాన్వీ ఎలా కనిపించనుందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

# మంచు విష్ణు 'కన్నప్ప'.. ఇప్పుడు ఫ్రీగా చూడొచ్చు!




మంచు విష్ణు కథానాయకుడిగా ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన భక్తిరస చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు నిర్మాత. అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం కీలక పాత్రలు పోషించారు. భక్తకన్నప్ప కథతో రూపొందిన ఈ చిత్రం తెలుగులో మంచి ఆదరణ పొందింది. విజువల్ వండర్‌గా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం ఇటీవలే ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా గత నెల 27న పరిమిత సంఖ్యలోని థియేటర్లలోనూ రీరిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సినీ అభిమానులు ఉచితంగా వీక్షించే వెసులుబాటును మంచు విష్ణు కల్పించారు. యూట్యూబ్ వేదికగా 'కన్నప్ప' మూవీని విడుదల చేశారు. ఇంకెందుకు ఆలస్యం ఈ వీకెండ్‌లో మీరూ 'కన్నప్ప' చూసేయండి.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన వచ్చే వారంలో..!




72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం నేడు ప్రకటించనున్నట్లు వార్తలు రావడంతో, అవార్డుల జాబితా కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూశారు. ఉత్తమ నటుడు, ఉత్తమ నటి తదితర పురస్కారాలు ఎవరికి దక్కుతాయనే విషయంపై నెటిజన్లలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అయితే, జాతీయ పురస్కారాలను నేడు ప్రకటించడం లేదని, వచ్చే వారంలో అవార్డుల జాబితాను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. అవార్డుల ప్రకటన తేదీని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని, అప్పటివరకూ దీనిపై ఎలాంటి ఊహాగానాలను విశ్వసించొద్దని ప్రభుత్వ వర్గాలు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొంది.

# ఓపెనర్లుగా ఆ ఇద్దరికే మొగ్గు!

**సూర్యవంశీ అరంగేట్రంపై క్లారిటీ ఇచ్చిన మోర్కెల్**



ఇంగ్లాండ్‌తో శనివారం జరగబోయే రెండో టీ 20 మ్యాచ్‌కు ముందు భారత యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ స్పష్టత ఇచ్చాడు. వైభవ్ అద్భుతమైన ప్రతిభావంతుడే అయినప్పటికీ, కేవలం ఒకట్రెండు వైఫల్యాల ఆధారంగా సీనియర్ ఆటగాళ్లను పక్కనబెట్టలేమని ఆయన స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లకే జట్టు యాజమాన్యం పూర్తి మద్దతు ఇస్తుందని మోర్కెల్ మీడియా సమావేశంలో వెల్లడించాడు.

"అభిషేక్ శర్మ ప్రపంచ అత్యుత్తమ టీ20 బ్యాటర్లలో ఒకడిగా రాణించాడు, అలాగే సంజూ శాంసన్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. కాబట్టి కోచింగ్ స్టాఫ్‌గా మా ఆటగాళ్లపై నమ్మకం ఉంచడం మా బాధ్యత. ఒక యువ ఆటగాడు జట్టులోకి వచ్చేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్న మాట వాస్తవమే, అది జట్టుకు మంచి సంకేతం. కానీ కష్ట సమయాల్లో దేశానికి విజయాలు అందించిన సీనియర్లకు అండగా నిలవడం ద్వారా డ్రెస్సింగ్ రూమ్‌లో నమ్మకాన్ని పెంచాలని మేము భావిస్తున్నాము" అని మోర్కెల్ పేర్కొన్నాడు.

జట్టులో స్థానం కోసం ఆరోగ్యకరమైన పోటీ ఉండటం శుభపరిణామమేనని, అయితే ఆటగాళ్లను వారి సాధారణ స్థానాల నుండి మార్చి ఇబ్బంది పెట్టకూడదని యాజమాన్యం నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపాడు. 15 ఏళ్ల వయసులో అంతర్జాతీయ వేదికపైకి రావడం కాస్త ఒత్తిడితో కూడుకున్నదైనప్పటికీ, నెట్స్‌లో వైభవ్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుందని.. సమయం వచ్చినప్పుడు అతనికి ఖచ్చితంగా అవకాశం దక్కుతుందని మోర్కెల్ ధీమా వ్యక్తం చేశాడు. ఐర్లాండ్ సిరీస్‌లో విఫలమైన సంజూ శాంసన్‌కు ఈ రెండో టీ20 మ్యాచ్ సవాల్‌గా మారనుంది.

# గడిచిన 15 ఏళ్ల ప్రయాణం ఒక అద్భుతం

**సోషల్ మీడియాలో స్టోక్స్ భావోద్వేగ లేఖ!**



ఇంగ్లాండ్ క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు ఆకస్మిక రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజున ఆయన ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించాడు. ఈ సిరీస్ ముగింపుతో తన 15 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌కు తెరపడుతుందని స్పష్టం చేశాడు. 2011లో అరంగేట్రం చేసిన ఈ 35 ఏళ్ల స్టార్ ఆల్‌రౌండర్, అన్ని ఫార్మాట్లలో కలిపి 11,321 పరుగులు సాధించడంతో పాటు 352 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్ ఆధునిక క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన ఆటగాడిగా నిలిచాడు. ఈ నిర్ణయం పూర్తిగా తన సొంత నిర్ణయమని, ఎవరి ఒత్తిడి లేదని స్టోక్స్ స్పష్టం చేశాడు. రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు తెలిపాడు. తన కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలతో పాటు వ్యక్తిగత, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నాడు. ఇకపై ఇంగ్లాండ్ జట్టుకు ఒక సాధారణ అభిమానిగా మారి, డ్రెస్సింగ్ రూమ్ వెలుపల నుండి మద్దతు అందిస్తానని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రాసుకొచ్చాడు.

తన భావోద్వేగ వీడ్కోలు సందేశంలో.. "గడిచిన 15 ఏళ్ల ప్రయాణం ఒక అద్భుతం. మైదానంలోనూ, వెలుపలా ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. నా సమయం ముగిసింది, ఈ నిర్ణయం నేనే తీసుకోవాలి, వేరొకరు తీసుకోలేరు. ఇన్నాళ్లుగా నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్క ఇంగ్లాండ్ అభిమానికి, క్రికెట్ ప్రేమికుడికి నా ధన్యవాదాలు. ఇంగ్లాండ్ తరఫున ఆడుతూ నేను మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు నాతో కలిసి నడిచిన ప్రతి ఒక్కరినీ నేను ప్రేమిస్తున్నాను. దేశం కోసం ఆడటాన్ని నేను ఎంతగానో ఆస్వాదించాను. నా కుటుంబం, స్నేహితులు, సహచరులు, అభిమానులు.. మీ అందరికీ నా కృతజ్ఞతలు" అంటూ స్టోక్స్ తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలికాడు.




# నేడే భారత్ vs ఇంగ్లాండ్ రెండో టీ20 పోరు

**సిరీస్‌లో బోణీ కొట్టేందుకు ఇరు జట్లు సై!**

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య కార్డిఫ్‌లోని సోఫియా గార్డెన్స్ మైదానంలో జూలై 4న (శనివారం) రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. దర్హామ్‌లో జరగాల్సిన మొదటి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా రద్దయిన నేపథ్యంలో, ఈ మ్యాచ్‌తోనైనా సిరీస్‌ను ఘనంగా ప్రారంభించాలని ఇరు జట్లు పట్టుదలగా ఉన్నాయి. భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 10:00 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

తొలి మ్యాచ్‌లో వర్షం పడటానికి ముందే భారత బ్యాటర్లు అద్భుత ఫామ్‌ను కనబరిచారు. ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు హాఫ్ సెంచరీ, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో టీమిండియా 189 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే వర్షం వల్ల బౌలర్లకు తమ సత్తా చాటే అవకాశం దక్కకపోవడంతో, ఈ రెండో మ్యాచ్‌లో భారత బౌలింగ్ విభాగానికి ఇంగ్లాండ్ గడ్డపై అసలైన పరీక్ష ఎదురుకానుంది.

మరోవైపు సొంతగడ్డపై ఎలాగైనా పైచేయి సాధించాలని ఇంగ్లాండ్ వ్యూహాలు రచిస్తోంది. తొలి మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ జోరును చూసిన ఇంగ్లీష్ జట్టు, ఈ మ్యాచ్‌లో మరింత పక్కా ప్రణాళికలతో బరిలోకి దిగనుంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం కార్డిఫ్‌లో వాతావరణం ప్రశాంతంగా ఉండే అవకాశం ఉండటంతో, ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి 20 ఓవర్ల మ్యాచ్‌ను ఆస్వాదించవచ్చని క్రికెట్ అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బుడిబుడి అడుగులకు బ్రేకులు.. బాల్యాన్ని మింగుతున్న షుగర్ మహమ్మారి"




- బాలలను కబళిస్తున్న మధుమేహ మహమ్మారి.. జంక్ ఫుడ్, గాడ్జెట్లే ప్రధాన కారణం
- ఫోన్ చేతిలో పెడితే ఫ్యూచర్ ఖతం.. పిల్లలకు పొంచి ఉన్న మధుమేహం ముప్పు"
- తీపి తిండి చేదు శాపం.. రేపటి తరాన్ని కాపాడేదెలా?"
- పరుగులు తీయాల్సిన వయసులో ఇన్సులిన్ సూదులా? మేలుకోకపోతే ముప్పే"
- రంగ కవిత గౌడ్... యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్...

**యాదాద్రి భువనగిరి జిల్లా జూలై 03 (వెలుతురు న్యూస్):**

ఒకప్పుడు వీధుల్లో సందడి చేసిన పసిమొగ్గలు ఇప్పుడు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాయి. తీపి కబుర్లు చెప్పాల్సిన వయసులో చేదు మాత్రలు మింగుతున్నాయి. పరిగెత్తాల్సిన పాదాలకు మధుమేహం సంకెళ్లు పడుతున్నాయి. చిన్నారుల్లో పెరుగుతున్న టైప్-1, టైప్-2 డయాబెటిస్ రేపటి భారతానికి పెనుముప్పుగా మారుతోంది.



## ముప్పునకు మూలాలెక్కడ?

**తిండిలో గోల్మాల్:**

పిజ్జాలు, బర్గర్లు, ప్యాకెట్ చిప్స్, కూల్ డ్రింకులు పిల్లలకు నోటికి రుచిగా ఉన్నా పొట్టలో షుగర్ లెవల్స్‌ను అడ్డగోలుగా పెంచేస్తున్నాయి. మైదా, చక్కెర, నూనెతో చేసిన జంక్ ఫుడ్ రోజా తింటే బరువు పెరగడం ఖాయం. బరువు పెరిగితే టైప్-2 మధుమేహం తలుపు తడుతుంది.

**కదలని కాయం:**

గల్లీలో ఆటలు బంద్ అయ్యాయి. పబ్జీ, ఫ్రీ ఫైర్ గేమ్స్ ముందు రోజంతా కూర్చుంటున్నారు. రోజుకు గంటసేపు చెమట పట్టేలా ఆడితే ఒంట్లో కొవ్వు కరుగుతుంది. కానీ సోఫాలోనే కూర్చుంటే ఒంట్లో కొవ్వు పేరుకుపోయి ఇన్సులిన్ పనిచేయడం మానేస్తుంది.

**వంశపారంపర్యం:**

తాతల ఆస్తితో పాటు రోగం కూడా వస్తోంది. ఇంట్లో అమ్మకు, నాన్నకు మధుమేహం ఉంటే పిల్లలకు 50 శాతం ముప్పు పొంచి ఉన్నట్లే.

**స్క్రీన్ టైం జాతర:**

చేతిలో ఫోన్, కళ్లన్నీ స్క్రీన్‌పైనే. నిద్ర తగ్గడం, ఒత్తిడి పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల చిన్న వయసులోనే షుగర్ వస్తోంది.

**ప్రమాద ఘంటికలు**

పిల్లల్లో మితిమీరిన దాహం, తరచూ మూత్ర విసర్జన, విపరీతమైన అలసట, చిరాకు, కారణం లేకుండా బరువు తగ్గడం, గాయాలు త్వరగా మానకపోవడం కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చిన్నతనంలోనే మధుమేహం వస్తే కిడ్నీలు, కళ్లు, గుండె దెబ్బతినే ప్రమాదం ఉంది. తోటి పిల్లలతో సమానంగా ఆడలేక, నిరంతరం ఇన్సులిన్ సూదులు గుచ్చుకోలేక పిల్లలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.




**నివారణే మహా ఔషధం**

ప్రభుత్వాలు బాలల మధుమేహ నియంత్రణకు మార్గదర్శకాలు తెస్తున్నా అసలైన మార్పు ఇంట్లోనే మొదలవ్వాలి.వాటి కోసం ఏం చేయాలి?

**పాత తిండికి జై కొట్టాలి:**

జొన్నలు, సజ్జలు, రాగులు, పచ్చి కూరగాయలు, పండ్లు అలవాటు చేయాలి. ప్యాకెట్ ఫుడ్, కూల్ డ్రింకులకు దూరం పెట్టాలి.

**ఆటలకు చోటు ఇవ్వాలి:**

రోజుకు కనీసం గంటసేపు మైదానంలో ఆడించాలి. సైకిల్ తొక్కడం, పరిగెత్తడం, ఆటలు అలవాటు చేయాలి.

**స్క్రీన్ టైం కట్టడి:**

ఫోన్, టీవీ వాడకాన్ని రోజుకు ఒక గంటకు పరిమితం చేయాలి. పిల్లలను ప్రకృతి ఒడిలో గడిపేలా ప్రోత్సహించాలి.

**అవగాహన పెంచాలి:**

బడిలో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు పోషకాహారం, వ్యాయామం ప్రాముఖ్యతపై పిల్లలకు చెప్పాలి.

**ఆర్థిక భారం తగ్గేదెలా?**

మధుమేహ చికిత్స ఖర్చు పేద, మధ్యతరగతి కుటుంబాలకు తడిసి మోపెడవుతోంది. నెలనెలా ఇన్సులిన్, టెస్టింగ్ స్ట్రిప్స్ కోసం వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. అందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభించే సేవలను విరివిగా వినియోగించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాలల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన NCD క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి.

**చిరునవ్వుల బాల్యం..**

**రోగాల పాలు కావొద్దు**

నేటి బాలలే రేపటి పౌరులు. వారే దేశానికి అత్యున్నత సంపద.

వాళ్లు రోగాల బారిన పడితే దేశ భవిష్యత్తు అంధకారమే. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ఆరోగ్యమే మహాభాగ్యం అని పిల్లలకు నేర్పాలి.

తీపి తిండిపై మోజు తగ్గించి, తీపి భవిష్యత్తును వారికి బహుమతిగా ఇద్దాం.

జంక్ ఫుడ్ జాతరను ఆపి, పసిమొగ్గలను కాపాడుకుందాం.

### ఇవి గుర్తుంచుకోండి

**పిల్లల్లో మధుమేహ లక్షణాలు:**

విపరీతమైన దాహం, ఆకలి, తరచూ మూత్రం, అలసట, చిరాకు, బరువు తగ్గడం.

**తినిపించాల్సినవి:**

రాగి జావ, జొన్న రొట్టె, ఆకుకూరలు, కాయగూరలు, మొలకలు.

**దూరం పెట్టాల్సినవి:**

ప్యాకెట్ చిప్స్, పిజ్జా, బర్గర్, కూల్ డ్రింక్స్, చాక్లెట్లు, కేకులు వంటివి పిల్లలకు ఇవ్వకూడదని డాక్టర్లు చెప్తున్నారు..



రంగ కవిత గౌడ్... యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్...

# అక్రమ ఫ్లెక్సీలు, ఆక్రమణలపై కర్ణాటక ఉక్కుపాదం: రూ. లక్ష జరిమానా

- పాదచారుల రక్షణే ధ్యేయం – త్వరలో కొత్త ఫుట్‌పాత్ విధానం
- వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా నిర్దేశిత జోన్ల కేటాయింపు
- అక్రమ ఫ్లెక్సీలపై కఠిన చర్యలు – ఫ్లెక్సీ వేయించిన వారికి భారీ జరిమానా
- పుట్టినరోజు శుభాకాంక్షలు, ప్రచార ఫ్లెక్సీల నియంత్రణకు కఠిన నిబంధనలు

**బెంగళూరు, జులై 3,వెలుతురు న్యూస్ :**

పాదచారులకు స్పష్టమైన మార్గాన్ని సుగమం చేసేందుకు మరియు నగర అందాలను దెబ్బతీసే అక్రమ ఫ్లెక్స్ బ్యానర్లను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం సరికొత్త విధానాన్ని తీసుకురానుంది. ఇందులో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఏకంగా ఒక లక్ష రూపాయల వరకు భారీ జరిమానా విధించ



నున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ప్రకటించారు. శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అనుమతి లేని ప్రకటనల బోర్డులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించబోతోందని స్పష్టం చేశారు.

నగరాల్లో భారీగా నిధులు ఖర్చు చేసి నిర్మించిన ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్‌కు, వ్యాపారాలకు వేదికగా మారడంతో పౌరులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరి వ్యాపారం కోసం మొత్తం ఫుట్‌పాత్‌ను మూసివేయడం వల్ల ప్రజలు రోడ్లపై నడవాల్సి వస్తోందని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందుకే ఫుట్‌పాత్‌లను రక్షించేందుకు కొత్త విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించామన్నారు. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా 'వెండింగ్ జోన్లను' కేటాయిస్తామని, ఆయా ప్రాంతాల్లో మాత్రమే రిజిస్టర్డ్ వ్యాపారులను అనుమతించి, మిగిలిన చోట్ల ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు.

ఇక నగరంలో ఎక్కడపడితే అక్కడ వెలుస్తున్న అక్రమ ఫ్లెక్స్ బ్యానర్లపై సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఎవరైనా సరే నిబంధనలు ఉల్లంఘిస్తే వదిలేది లేదన్నారు. ఫ్లెక్సీల కింద ఎవరి పేరు ఉంటే వారికే జరిమానా నోటీసులు పంపుతామని హెచ్చరించారు. ప్రతి అక్రమ ఫ్లెక్సీకి రూ. 50 వేల నుండి రూ. లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు. పుట్టినరోజు వేడుకలు, ఇతర ప్రచారాల కోసం అధికారిక ప్రకటనల బోర్డులను మాత్రమే వాడుకోవాలని, ఎక్కడపడితే అక్కడ బ్యానర్లు కడితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ హెచ్చరించారు.

# ఉగ్రవాదాన్ని ఆపకుంటే 'సింధు జలాలు' బంద్

- పాకిస్తాన్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్
- ఉగ్రవాదాన్ని ఆపకుంటే ఒప్పందం పునరుద్ధరించే ప్రసక్తే లేదు
- సింధు జలాలపై భారత్ పాత వైఖరికే మొగ్గు
- "చేతులు నరికేస్తాం" అన్న పాక్ మంత్రికి గట్టి కౌంటర్
- తీస్తా ప్రాజెక్టుపై బంగ్లాదేశ్‌తో రోడ్‌మ్యాప్ ప్రకారం ముందడుగు

**న్యూఢిల్లీ, జులై 3,వెలుతురు న్యూస్ :**

సింధు జలాల ఒప్పందం ప్రకారం తమకు దక్కాల్సిన నీటి వాటాను అడ్డుకుంటే ఊరుకునేది లేదంటూ పాకిస్తాన్ హెచ్చరించిన కొద్దిరోజులకే కేంద్ర ప్రభుత్వం దానికి దీటైన సమాధానం ఇచ్చింది. ఇస్లామాబాద్ సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపి, నమ్మదగిన మరియు వెనక్కి తీసుకోలేని చర్యలు చేపట్టే వరకు 1960 నాటి సింధు జలాల ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ శుక్రవారం స్పష్టం చేసింది. ఈ విషయంలో తమ పాత వైఖరిలోనే మార్పు లేదని కేంద్రం పునరుద్ఘాటించింది. న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

"సింధు జలాల ఒప్పందంపై భారతదేశ స్థానం ఎల్లప్పుడూ ఒకేలా ఉంటుంది. పాకిస్తాన్ నిరంతరం సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందున ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది. పాకిస్తాన్ మొదట నమ్మదగిన రీతిలో, శాశ్వతంగా ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం మానేయాలి" అని జైస్వాల్ స్పష్టం చేశారు. గతేడాది ఏప్రిల్ 22, 2025న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత, పాకిస్తాన్‌పై తీసుకున్న కఠిన చర్యల్లో భాగంగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.మరోవైపు పాకిస్తాన్ పెట్రోలియం శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ ఇటీవల మాట్లాడుతూ.. ఈ ఒప్పందం కింద పాక్ వాటా నీటిని లాక్కోవాలని చూసే వారి "చేతులను నరికేస్తాం" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ దేశ సమాచార మంత్రి అతావుల్లా త్రార్ సైతం స్పందిస్తూ.. ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో 1960 సెప్టెంబర్ 19న జరిగిన ఈ చారిత్రాత్మక ఒప్పందం చట్టబద్ధంగా కట్టుబడి ఉంటుందని, దీనిని ఏకపక్షంగా సవరించడం లేదా రద్దు చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే భారత్ తన నిర్ణయాన్ని మార్చుకునే ప్రసక్తే లేదని గట్టిగా తేల్చిచెప్పింది.ఇదే మీడియా సమావేశంలో తీస్తా నది ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్నకు కూడా రణధీర్ జైస్వాల్ సమాధానమిచ్చారు. బంగ్లాదేశ్‌కు భారతదేశం అందించే అభివృద్ధి సహాయం అంతా పరస్పరం అంగీకరించిన రోడ్‌మ్యాప్ ఆధారంగానే సాగుతుందని, దీనిని క్రమం తప్పకుండా సమీక్షిస్తామని తెలిపారు. తీస్తా నది ప్రాజెక్టుకు సంబంధించి భారతదేశ అభిప్రాయాలను ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలియజేశామని, ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని రకాల పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



# టీనేజ్ పిల్లలను ఇలా పెంచండి..!



**మన సమాజంలో తల్లిదండ్రులు పెరుగుతున్న వయస్సులో వచ్చే మార్పులు గురించి సరిగ్గా చెప్పరు. అయితే, ఇదే అతి పెద్ద తప్పు. ప్రతి వయస్సు పిల్లలకు కొత్తది. వయసు పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు వచ్చినప్పుడు ఆందోళన చెందుతారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కూర్చోబెట్టి యుక్తవయస్సు గురించి చెప్పాలి. ప్రతి పేరెంట్ అబ్బాయిలను కూర్చోబెట్టి గడ్డం, మీసాలు, గొంతులో మార్పు, యవ్వనంలో కలిగే కోరికలు గురించి చెప్పాలి. అదేవిధంగా ఆడపిల్లలకు పీరియడ్స్ గురించి చెప్పాలి. ఇలా చేయడం వల్ల వారు ఆకస్మిక మార్పులకు భయపడరు.**

మన సమాజంలో తల్లిదండ్రులు పెరుగుతున్న వయస్సులో వచ్చే మార్పులు గురించి సరిగ్గా చెప్పరు. అయితే, ఇదే అతి పెద్ద తప్పు. ప్రతి వయస్సు పిల్లలకు కొత్తది. వయసు పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు వచ్చినప్పుడు ఆందోళన చెందుతారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కూర్చోబెట్టి యుక్తవయస్సు గురించి చెప్పాలి. ప్రతి పేరెంట్ అబ్బాయిలను కూర్చోబెట్టి గడ్డం, మీసాలు, గొంతులో మార్పు, యవ్వనంలో కలిగే కోరికలు గురించి చెప్పాలి. అదేవిధంగా ఆడపిల్లలకు పీరియడ్స్ గురించి చెప్పాలి. ఇలా చేయడం వల్ల వారు ఆకస్మిక మార్పులకు భయపడరు.

**ప్రశాంతంగా సలహాలు ఇవ్వండి..**

టీనేజ్ పిల్లలు ఎవరి మాట వినడానికి ఇష్టపడరు. వారు చేసిందే కరెక్ట్ అనుకుంటారు. దీంతో తల్లిదండ్రులకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. తల్లిదండ్రుల మాట వినరు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు వారిని తిట్టకూడదు లేదంటే కొట్టకూడదు. తల్లిదండ్రులు కూడా వారి వయసుకు వచ్చారని అర్థం చేసుకోవాలి. అందుకే వారితో ప్రశాంతంగా కూర్చొని మంచి సలహాలు ఇవ్వండి. అంతేకానీ మీ నిర్ణయాల్ని వారిపై బలవంతంగా రుద్దకండి. ఏదైనా సరే వారికి ప్రేమగా వివరించండి.

**పిల్లలను గౌరవించడం, వారి మాట వినడం..**

తల్లిదండ్రులు తమ పిల్లలను గౌరవించడం కూడా చాలా ముఖ్యం. పిల్లలకు సొంత వ్యక్తిత్వం ఉంటుంది. టీనేజ్ పిల్లలకు కూడా కొన్ని ఇష్టాలు, అయిష్టాలు ఉంటాయి. అందుకే వారు చెప్పే ప్రతిదాన్ని ప్రశాంతంగా వినండి. చాలా సార్లు పిల్లలు తెలిసి లేదా తెలియక కొన్ని తప్పులు చేస్తారు. కొన్ని సార్లు మంచి పనులు కూడా చేస్తారు. అందుకే వారి ఏది చేసినా జాగ్రత్తగా పరిశీలించండి. తప్పుడు దోవలో పోతే వారిని సరిదిద్దండి. మంచి పనులు అయితే వారిని ప్రోత్సహించండి. పిల్లలకు గౌరవం లభిస్తే, వారు కూడా తల్లిదండ్రుల్ని గౌరవిస్తారు. ప్రతి పని చేసేలా వారిని ప్రేరేపించాలి. పిల్లలు ఏదైనా అడిగినప్పుడు.. ప్రశాంతంగా వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి.

**మంచి నేర్పండి..**

ప్రతి ఒక్కరూ పిల్లలను పైలట్, ఇంజనీర్, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావాలని కలలు కంటుంటారు. అయితే, వారిని మంచి మనుషులుగా మార్చడంలో కూడా శ్రద్ధ పెట్టాలి. చిన్నతనం నుంచే వారికి కొన్ని మంచి పనులు నేర్పండి. దానధర్మాల చేయడం, పేదలకు వారి చేతుల మీదుగా కొన్ని వస్తువుల్ని పంచి పెట్టడం, మంచి పని కోసం విరాళాలు సేకరించడం ఇలా పనులు చేయించాలి. జంతువులు, పెద్దల పట్ల మంచిగా మెలిగేలా వారికి నేర్పించండి. చిన్న చిన్న పనులే వారిలో దయ, మానవత్వాన్ని పెంచుతాయి.

**ఒంటరిగా వదిలేయకండి..**

ఈ వయసులో టీనేజ్ పిల్లలు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు . అయితే వారిని ఒంటరిగా వదిలిపెట్టకూడదు. వారిని ఏదో ఒక పనిలో బిజీగా ఉంచండి. ఇంటి పనులు చేయించడం.. బయటి నుంచి ఏదైనా వస్తువు తీసుకురమ్మనడం లాంటి పనులు చేయించండి. చాలా మంది తల్లిదండ్రులు అమ్మాయిలతో ఇంటి పనులు చేయిస్తారు. కానీ అబ్బాయిలను ఏ పని చేయమని అడగరు. అలా చేయడం తప్పు. అబ్బాయిలు కూడా బాధ్యతగా ఉండాలి. వాళ్లు కూడా ఆడపిల్లల్లా ప్రతి పని చేయగలగాలి.


**నైపుణ్యాలపై శ్రద్ధ పెట్టండి..**

ప్రతి పిల్లల్లో ఖచ్చితంగా ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. తల్లిదండ్రులు దాన్ని బయటకు తీసి సాన బెట్టాలి. పిల్లలకు ఎందులో టాలెంట్ ఉందో అందులో ముందుకు సాగేలా ప్రోత్సహించండి. వారికి ఎలాంటి నైపుణ్యాలు లేకపోయినా చింతించకండి. వారికి నచ్చిన విధంగా నైపుణ్యాలను నేర్పించండి. సంగీతం, నృత్యం, పెయింటింగ్, స్విమ్మింగ్, క్రీడలు ఏదైనా సరే ఎంకరేజ్ చేయండి. ఇది పిల్లల నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వాస్తవానికి, పిల్లలు కౌమారదశలో ప్రతికూలతకు గురవుతారు. కానీ నైపుణ్యాలు వారి ఆలోచనలను సానుకూలంగా చేస్తాయి.

**డబ్బు విలువ నేర్పండి..**

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతి కోరికను తీర్చడం చాలా ముఖ్యమనుకుంటారు. అయితే, ఇలా చేస్తే వారు డబ్బుకు విలువ ఇవ్వరు. పిల్లలకు చిన్నతనం నుంచే డబ్బు విలువ నేర్పించడం చాలా ముఖ్యం. వారు అడిగే ప్రతి డిమాండ్‌ను నెరవేర్చాల్సిన అవసరం లేదు. వారికి నెలకు సరిపడా పాకెట్ మనీ ఇవ్వండి. అందులోనే అన్ని ఖర్చులు ప్లాన్ చేసుకోమని చెప్పండి. అంతేకాకుండా డబ్బుల్ని పొదుపు చేయమని కూడా చెప్పండి. ఖర్చుల్ని స్వయంగా ప్లాన్ చేసుకుంటే వారికి డబ్బు విలువ తెలుస్తుంది. టీనేజ్ పిల్లలకు బ్యాంకింగ్, ద్రవ్యోల్బణం గురించి తెలిసేలా చెప్పండి.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ప్రవర్తనను బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com